కీలెరిగిన వాత

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

"నీ కేవిధమైన ఆక్షేపణా లేనప్పు డిక యీ ఆలస్యం యెందుకూ?"

ఈమాట అడిగినప్పుడు కృష్ణవేణి మొగం ప్రసన్నంగా లేదు. పైగా ఆందోళన పుట్టించేటట్టుగా కూడా వుంది. అతనికి ఆందోళన పుట్టింది కూడానూ. కాని పక్కాలౌక్యుడు. క్షణంలో మనసు కుదుటపరుచుకుని యిదేమీ యెరగనట్టు సంభాషణ సాగించాడు.

"అవసరం లేదు. దేవుడిచ్చిన వరం అనుభవించడానికి జాప్యం చెయ్యడం తెలివితక్కువ."

"అదే యిప్పుడు జరుగుతూ వున్నది."

"ఒప్పుకున్నాను నిజమే. అయితే; నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. హృదయపీఠంమీద ప్రతిష్ఠించుకుని నిన్నెప్పుడూ ఆరాధిస్తున్నాను. నేను నీప్రేమకు పాత్రమయినందుకు బ్రహ్మానందం పొందుతున్నాను. లోకంకోసం ఆకాస్త తంతూ ముగించడానికిక ఆలస్యం చెయ్యడం బాగాలేదు."

"నెల్లాళ్ల కిందటా యీ మాటే అన్నావు. వారం రోజులనాడూ యిదే అన్నావు. ఇప్పటికిప్పుడూ—"

"అబ్బ! కృష్ణా! నీకు కోపం వస్తే నేను తాళలేను. నువ్వు నన్ను సందేహించావంటే యిక నీమొగం చూడలేను"

"నీమొగం చూపించగలవు....కదూ?"

వూచలాగ తగిలింది అతని కీమాట. మొగం పక్కకి తిప్పుకున్నాడు.

....

"నువ్వు, ముందుముందు సంసారంలో చూపించబోయే చాతుర్యానికిది మచ్చు కాబోలు"

"ఎంత మాట అనేశావూ? నా తపన నీకు బోధపడలే దన్నమాట......నిన్ను చూశాటప్పటికి నా కళ్లు జిగల్‌జిగల్ మనిపోతూ వున్నాయి. హృదయం గజిబిజిపడిపోతూ వుంది. కృష్ణా! నీపరోక్షంలో నే నెన్నో కల్పనలు చేసుకుంటూ వుంటాను. నీ పాదాలదగ్గిర కూచుని యెన్నో మనవిచేసుకోవాలనుకుంటూ వుంటాను; కాని యెదటికి వచ్చాటప్పటికి—ముహూర్తం ఆలస్యం అవుతూ వున్నందుకు నువ్వు పొందే అసంతృప్తి—నీ బొమముడి చూశాటప్పటికి నా కల్పన అంతా యెగిరిపోతూ వుంది. మనస్సు బేజారయిపోతూవుంది"

"ఇదంతా యేమిటీ?"

"నే నిప్పు డేమన్నానూ?"

తడుముకోకుండా కమ్మపరిచి- పైగా యెదురు తిరగడం ఆమెని భ్రాంతురాలిని చేసింది.

"బాగుంది."

ఇంతకంటే ఆమె మాటాడలేకపోయింది.

"కృష్ణా!"

"..............."

"నువ్వు మొగం అలా తిప్పుకుంటే యిక నాపని యేం కానూ?

"..............."

"నామాట——"

"........దూరంగా వుండు. పెళ్లికాకుండా నువ్వు నన్ను తాకడానికి వల్లకాదు."

"నీ సెలవుచొప్పున నడుచుకుంటాను; కాని అప్పటిదాకా తాళలేను; కనక దయవుంచి—కనికరించి యిప్పటి కొక్క ముద్దు—"

"వల్లకాదు"

"అబ్బా!"

"..............."

నా కేమీ అర్థం కావటంలేదు. ఇంతటి రూపరాశి—ఇంతటి ప్రేమనిధానం యింత కాఠిన్యం యెలా

చూపించగలుగుతూ వుందో నా కెంతమాత్రమూ బోధ పడడంలేదు.

"మొగవాడవు, నీ కింత బేలతనం యేమిా?"

"..............."

"నీకు భార్యకాని స్త్రీచెయ్యి పట్టుకోవాలనే హృదయదౌర్బల్యం నీ కెలా కలిగిందోయ్ ?"

"సెబాస్ ! నిన్ను మెచ్చుకుంటున్నాను. కృష్ణా ! నీశీలం నన్ను ఆనందపరవశుణ్ణి చేసింది. నిన్ను భార్యగా పడసినవాడే పురుషుడు. ఆ బిరుదు నాకే తక్కపోతూ వున్నందుకు గర్విస్తున్నాను. వివాహానికి క్షణం ఆలస్యం అయినా యిక నేను తాళలేను. ఆ యేర్పాటు నువ్వెప్పుడు చేయిస్తే నే నాక్షణంలో సిద్ధం."

"అంటే ?"

"ముహూర్తం స్థిరపరిపించి, మీ నాన్నగారు నన్నెప్పుడు రమ్మంటే ఆక్షణంలో—"

"నాన్నగారు అన్నీ క్షణంలో సిద్ధం చేయిస్తారు. మీ వాళ్లతో చెప్పి, వీలు చూసుకుని నువ్వే ముహూర్తం స్థిరపరిపించాలి."

అతనికి జవాబు తోచలేదు.

"మాట్లాడ వేం ?"

".........పోనీ, ముహూర్తం నేనే స్థిరపరిపిస్తాను; కాని యీ విషయంలో మీ నాన్నగారు నాతో యేమీ మాట్లాడకుండా—"

"మీ సమ్మంధం నాన్నగారికి సర్వవిధాలా యిష్టమే నాన్నగారి మాట అమ్మ యేదీ కాదనదు. నిన్ను పెళ్లిచేసుకోడానికి వా రిద్దరూ నాకు సంబరపడుతూ సెలవిచ్చారు."

"అది సరే. మీ సమ్మంధం మానాన్న కూడా అంగీకరించాడు. మానాన్న చేసింది మా అమ్మ అంగీకరించక తప్పదు. కనుక వుభయుల్తా కూడా పెద్దల అభ్యంతరం యేమీ కనపడదు"

"ఇం కేమిటీ ?"

"ఈస్థితిలో మీనాన్నగారు నాతోగాని, మా నాన్నతో గాని మాట్లాడవలసిన పనిలేదంటావా నువ్వు."

"నా కేమీ కనపడ్డం లేదు"

"నువ్వు బాగా ఆలోచించలేదు. అసలు, ఆలోచించినట్టే కనపడదు. నిజానికి, నన్ను నువ్వూ, నిన్ను నేనూ పెళ్లిచేసుకోడానికి అంగీకరించవలసిన వాళ్లం మనం యిద్దరమే. అయితే: యితర యేర్పాట్ల విషయం."

"ఇతర యేర్పాట్లంటే ?"

కృష్ణవేణికి, ఇందులో యేదో గొడవ వున్నట్టు తోచింది. ఏమిటో బోధపడలేదు. అన్నీ స్థిరపడ్డ తరవాత యీలాంటి ప్రస్తావన రావడం ఆమెకి విసుపు పుట్టించింది.

అత నిది గ్రహించాడు. కాని ముస్సద్దీ వకీలు కాగల ననే ధైర్యం వున్న ఘటం.

".........తెలవకే అడుగుతున్నావా నువ్వు?"

"తెలిస్తే అడగడం యెందుకూ?"

అతను వొక్కమాటు మొగం పక్కకి తిప్పుకున్నాడు. పక దైన కల్పన తోచింది.

"ఇవాళ నువ్వు విషమపరీక్ష మొదలుపెట్టావు. నాకు దీని కేమీ కారణం కనపడ్డంలేదు."

"..............."

"నీ హృదయంలో యెవరో సంశయబీజాలు వెదచల్లారు."

ఆమె పులుకూ పులుకూ చూసింది.

"నా సుఖంలో— నా ఆనందంలో నిగ్గంతా యెవరో విరిచేశారు."

"..............."

"సచ్ఛితంలేని హృదయం నాది. కల్మషంయెరగని ప్రేమ నాది, అగ్గికి చదలంటవు నాహృదయంచీల్చి చూపించిఅయినా నేను మళ్లీ నిన్ను ప్రసన్నరాలుగా చేసుకోగలను."

"..............."

"నీచదువు చూసి నేను ఆశపడలేదు. నీ సౌంద ర్యంకోసం నేను ప్రేమించలేదు. ఆవేళ నువ్వు గోదా వరి గట్టున నిండుచూలా లయిన బిచ్చకత్తెకు, అప్పుడే కొనితెస్తూవున్న చీరా, చేసంచిలోనుంచి తీసి అయిదు రూపాయలూ సంతోషంతో యిచ్చావు. ఆ డబ్బుతో ఆమె నిర్విచారంగా పురుడు పోసుకుంటుందని నువ్వు పరమానందపడ్డావు. నేనదంతా కళ్లారా చూశాను. అదే నాకు నీ మొదటిదర్శనం. నా హృదయం ఆనందముగ్ధ మయిపోయింది. నా ఆత్మ నీపాదాలమీద ఆనంద బాష్పాలు రాల్చింది. చెప్పవచ్చిందేమిటంటే? అలాంటి గొప్ప ఔదార్యం చూడడంవల్ల కలిగిన ప్రేమ నాది. దీనికిక తిరుగులేదు. దీని కెవరూ, యెంతమాత్రమూ విఘాతం కలిగించలేరు. నా ప్రేమ నీభావౌన్నత్యం తప్ప మరేమీ చూడదు, కోరదు."

ఆమెకి యేవగింపు కలిగింది. దాన్ని ఆమె దూరంగా తరిమివేసుకోలేకపోయింది.

"గొప్ప సినీమానటుడికి కావలసిన యోగ్యత అంతా నీదగ్గర వుంది."

గతుక్కుమన్నా డతను.

"నువ్వింత గొప్ప వక్తవని నే నెప్పుడూ అనుకో లేదు."

"కృష్ణా! నన్నేం చెయ్యమంటావూ? నావల్ల యేమి పొరపాటు జరిగిందీ?"

ఇది ఆమెకి యద్దేవాగా కనపడింది.

"నీవల్ల యేమీ జరగలేదు."

"వద్దు వద్దు. నీకు కోపం వద్దు. కాస్త లోకా చారం గమనిస్తే అంతా నీకే బోధపడివుండును."

"......................"

"ధోరణి చూడగా నా నోటనే చెప్పించాలని నీ అభిలాషగా కనబడుతూ వుంది. అలాగే కానిద్దాం. నీ ఆజ్ఞ నెరవేర్చడంకంటే నాకు సంతోషకర మయి నది మరి లేదు."

"......................"

"........మనవి చేసుకుంటున్నాను"

"వింటున్నాను."

"నువ్వు ఇంటరు చదివాటప్పుడు, మీ నాన్న గారు, నిన్ను గొల్లకోట సదాశివదయనులుగారి అబ్బా యికి యివ్వతలచి, కట్నం రెండువేలూ, లాంఛనాలు అయినువందలూ యిస్తామని కభురు పంపించారు."

"అవును. అది వెనకటి మాట."

"మరి యిప్పటి మాట యేమిటీ?"

ఆమెపెదవులు రావిరే ల్లాగ కదిలాయి.

"కట్నం మాటా?"

"......................"

"నీకు కట్నమూ, మీ అమ్మకీ, అక్కకీ లాంఛ నాలూ యెంతెంత యిస్తారనా?"

"..............."

"నువ్వు నన్ను పెళ్లి చేసుకోవా లంటే, మా నాన్నగారు నీకు డబ్బివ్వా లంటావా?"

"ఇప్పుడు సంపన్నుల యిళ్లల్లో పెళ్లిళ్లెలా జరుగు తున్నాయో నీకు తెలవందా?"

"తెలిసింది. కట్నమూ, లాంఛనాలూ నిర్ణయం కాకపోవడంవల్ల నే నువ్విలాగ కాలంగడుపుతున్నావు."

"..............."

"కదూ?"

"అవు నలాగే."

కిందిపెదవి కొరుక్కుంటూ ఆమె పెద్ద నిట్టూర్పు విడిచింది. వక్షస్థలం అదిరింది.

"మా నాన్నగారు దమ్మిడీ కట్నం యివ్వరు!"

"..............."

"వారిదగ్గర యీ మాట యెవ రెత్తినా మాట తక్కదు."

"..............."

"ఇంతే కాదు. ఆమాట నాచెవిని కూడా పడ నాకి వల్లకాదు."

"నే నేం లేనివాణ్ణా కానివాణ్ణా? కురూపినా, చదువులేనివాణ్ణా? పాతిక సంవత్సరాలు మొన్ననే నిండాయి, నాకు పెళ్ళికాదని బెంగా? నా వాటా భూములమీద సాలీనా వెయ్యి రూపాయలు వస్తాయి ఇల్లొకటి వస్తుంది పైగా, నేను, సొంతంగా ప్రాక్టీసు పెట్టుకున్నానంటే వెంటవెంటనే పెద్దపెద్ద కేసులు డజన్లకొద్దీ వచ్చే సూచనలెన్నో వున్నాయి. ఇలాంటి స్థితిలో కట్నం లేకుండా పెళ్ళిచేసుకుని, నేను, సాటి వాళ్ళలో తలయెత్తుకు తిరగ్గలనా?"

"ఏమి పౌరుషం?" అంటూ ఆమె వొక్క క్షణం నిర్విణ్ణ అయిపోయింది. ఉత్తర క్షణంలో "ఇలాంటి పౌరుషవంతులు నీ స్నేహితుల్లో చాలామంది వున్నారనుకుంటా..." అంది నిరసనభావం కనపరుస్తూనూ.

"అవును, ఉన్నారు. ఏంతక్కువా?"

"ఉన్న దేమిటే? ఒక కన్యను పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడినందుకు మొగాడికి కట్నం యెందుకివ్వాలి?"

"మొగాడు కనుక."

"ఛీ! అదీ మొగతనమే."

"..............."

"మొగాడికి కళ్లు ఎంత నెత్తికెక్కాయీ?"

అతను వెటకారంగా నవ్వాడు.

ఆమెకి రోషం వచ్చింది.

"స్త్రీధనంవల్ల జీవించతలుచుకునే నువ్వు స్త్రీని స్మరించడానికేనా తగవు."

"హు. హు. స్త్రీధనం. స్త్రీధనం అంటే మొగుడు స్త్రీకి ఇచ్చేది. కన్యాదాత వరుడి కిచ్చేది కాదు. స్త్రీధనం అంటే యేమిటో తెలియని స్త్రీని పెళ్ళిచేసుకోవడం కంటే అవివేకం వుండదు. ఒప్పుకుంటున్నాను."

"నేను గోతిలో పడిపోకుండానే నీ నిజస్వరూపం బయటపెట్టినందుకు చాలా సంతోషం."

"నేనూ అందుకే సంతోషిస్తున్నాను."

"నువ్వు సుందరుడవంటే కనబడుతూనేవుంది; కాని నీకు ఆత్మసౌందర్యం లేదు. చదువుకున్నవాడవంటే అదీ కనబడుతూనే వుంది. నీ చదువు నీకు చిత్తసంస్కారం కలిగించలేదు. అడవిగాసిన వెన్నెల అయిపోయింది."

"నువ్వధికప్రసంగం చేస్తున్నావు. నీ తండ్రి జిల్లా జడ్జీపని చేసివుంటే యెవరికీ వొరగదు. నువ్వు బి. ఏ. వని గర్విస్తున్నావేమో గుడ్డిగవ్వకు మారవు. తగినమొగుడు రావాలంటే పెళ్లిబేరమనుకుంటున్నట్టున్నావు. అబ్బో! గుర్రం దిగు."

"నువ్వు మాట్లాడతగ్గవాడవు కావు. నాయెదటినుంచి తక్షణం వెళ్ళిపో."

"పొద్దున్నే లేచి—"

"ఛో! నుంచోకు."

అతను వాగ్వాదానికి జంకేవాడు కాడు. కాని, నమ్మించి నమ్మించి తన ద్రవ్యాశ యిప్పుడు బయటపడిపోయి—పైగా వ్యవహారం యెరిగి తిరిగినందుకతనికి కొంచెం సిగ్గు వచ్చింది. కట్నం మాట కృష్ణవేణి తండ్రిగాని, మరొక పురుషుడుగాని తిరస్కరించి వుంటే అందులో యీ తీవ్రతా లేకపోవును. అతనికి కోపమూ పుట్టకపోవును. సూటిగా వధువే నీకు మగతనం లేదనడం అతనికి కొట్టినంత పని అయింది.

పూచలాగ వెళ్లిపోయాడు.

కృష్ణవేణి పదినిమిషాల దాకా శాంతపడలేకపోయింది. విసురుగా వెడుతూ అతగాడు కనపడ్డంతసేపూ, ఆమె, తొక్కతొక్కిన ఆడతాచులాగ బుస్సలు కొట్టి తరవాత "నీచుడా" అంటూ గిరుక్కున తిరిగి యింటికి వెళ్ళిపోయింది.

౨

కృష్ణవేణి వీధిలోనుంచీ, ఆమె తల్లి రాధమ్మ వంటింటి వసారాలోనుంచీ వచ్చి దక్షిణపు వసారా గదిలో వొక్కమాటే ప్రవేశించారు. కృష్ణవేణి అతివేగంగా వెళ్లి సోఫామీద చదికిలబడింది. రాధమ్మ ఆమె

వాలకం చూసి కంగారుపడి, టీపాయి మేజామీద పెట్టేసి "ఏం తల్లీ?" అంటూ దగ్గరకూచుని వీపునిమురుతూ అడిగింది

"సమ్మంధం తిరిగిపోయింది."

"అయ్యో!"

కృష్ణవేణి ఆదైన్యానికి తిరగబడి తీవ్రంగా చూసింది.

"ఏం?"

"వాడికి కట్నం కావాలి."

"ఎంతట?"

"వాడి తలకా యంత ....ఎంతయితే మాత్రం యివ్వడాని కితల పడిగాపులు పడి కూచున్నారా యేమిటి?"

రాధమ్మ మాట్లాడ లేకపోయింది. ఇరవై యేళ్ల కూతురికి కుదరకకుదరక కుదిరిన సమ్మంధం తిరిగి పోయిం దనేటప్పటికి ఆయిల్లాలి తల తిరిగిపోయింది.

ఇ దేమీ గమనించకుండా వృత్తం ముగిస్తూ వున్న రామచంద్రయాజులు, యీమాట విని వులిక్కి పడి, లేచివెళ్లి కూతురిదగ్గిర కూచుని "అతనే అడిగాడా తల్లీ?" అన్నాడు.

"అవును, వాడే అడిగాడు. లాంఛనాలు కూడా కావాలిట నాన్నారూ!"

"చీమూ నెత్తురూ లేని తుమ్మగుంగ ఎందుకు వచ్చిన చదువూ?"

యాజులుకూడా యిలా అనడం రాధమ్మకి వుద్ధారంగా కనపడింది. దీంతో యీ సమ్మంధాన్ని గురించి ఆమె పూర్తిగా నిరాశపడిపోయింది.

యాజులు రాధమ్మయింగితం కనిపెట్టాడు; కాని లెక్కచెయ్యతలుచుకోలేదు. ఈ విషయంలో ఆమె సలహా చెప్పతగ్గది కాదని అతను మొదటే నిశ్చయించుకున్నాడు.

"నువ్వే మన్నావమ్మా?"

"'నీ మొగం చూడకూడదు, అవతలికిఫో' అన్నానండీ."

"మంచి పని చేశావు."

రాధమ్మ మొగుడికేసి పులకపూ పులకపూ చూసింది; కాని మొగం పక్కకి తిప్పుకుని వుండడంవల్ల అత నది గమనించలేదు. అయితే, కృష్ణవేణి కనిపెట్టి "నువ్వేమంటావూ?" అన్నట్టు వురుముతూ చూసింది.

"కాలం......కాలం యిలా మండిపోతోంది. "మీ అబ్బాయికి మా అమ్మాయిని చేసుకోవలసిం దని చెప్పాటప్పటి కేమిస్తా వని—"

"ఆ అబ్బాయిగాడే అలా యేడిస్తే?"

కృష్ణవేణి యీ మాట చాలా దురుసుగా అడిగింది.

"నిజం చెప్పు. అతగాడు కట్నం కావాలంటే నువ్వే మన్నావూ?"

"నాన్నారితో చెప్పండే. నీ మొగం చూడ గూడదు పో పొమ్మన్నాను"

"నిజంగా యీ మాటే అన్నావా?"

"అనక యేం, భయమా? వెంటనే వా డవతలికి చల్లగా జారుకున్నాడు కనక సరిపోయింది; కాని లేకపోతే యేం జరుగునో?"

"........ఆడదాని కంత దురుసుతనం పనికి రాదమ్మా."

కృష్ణవేణి యాజులుకేసి చూసింది. యాజులు రాధమ్మ కేసి చూస్తూ "యేంచేతా?" అన్నాడు.

"ఏం చేసినా మొగాడికి చెల్లుతుంది."

"ఆడది చెల్లనిస్తేను......అంతే కాదూ?"

"ఎఫ్. ఏ., బి. ఏలు చదువుకుంటేమాత్రం ఆడపిల్ల లంతా యిలా అంటున్నారా?"

"అనని వా ళ్లనుభవిస్తారు......అడగడాని కేం వుందీ?"

"ఇప్పుడు అమ్మాయి మాట?"

"గొప్ప ఆశయాలు గల పిల్ల—"

"మీ రుండండీ నాన్నారూ" అంటూ కృష్ణవేణి అడ్డువచ్చింది.

"అమ్మాయి కేం లోటు వచ్చిం దమ్మా యిప్పుడూ?"

"పెళ్లి లేకుండా యింటో కూచుంటావా?"

"పెళ్లాడితే యిలాటి దేబెలనా?"

"మొగపిల్ల లంతా యిప్పుడిదే మచ్చు."

"వాళ్ల మొగతనం అనుకున్నట్టే వుంది."

రాధమ్మ యాజులుకేసి చూసింది. యాజులు "అమ్మాయి సిసలుగా చెప్పింది. ఏం, అలా చూస్తావేం?" అన్నాడు.

"దాని చదు వింతపని చేసింది."

"నువ్వు సరిగా చెప్పావు. చదువుకుని, జ్ఞానం వచ్చిన ఆడపిల్ల యిలాగే చేస్తుంది."

"చదువుకుంటే మొగు డక్కర్లేదూ?"

"మొగాడికి పెళ్లాం అక్కర్లేదూ?"

"మొగాడికి పెళ్లి కాకపోతే యేదీ అడ్డదు, ఎవరూ యేమీ అనరు. అనే లేరు."

"చివరి కిదీ ముక్తాయింపు. దీనిమీదే వొంటికాలి భరతం చెలామణీ అవుతూ వుంది.........సంఘం పూర్తిగా కుళ్లిపోయి వుంది. ఎదురు తిరిగినవాళ్లు కొన్ని యిబ్బందు లనుభవించక తప్పదు; కాని యింకెన్నాళ్లీ యీ దౌర్జన్యం?"

"మాట్లాడితే వుపన్యాసాలు. మీతో నేను వాదించలేను. చివరికి అమ్మాయికి పెళ్లి చేస్తారా చెయ్యరా?"

"మళ్లీ మొదటికి వచ్చావూ?.........అయితే నీ కెలా తోస్తోందీ?"

"కట్నం యిస్తేగాని మంచి సమ్మంధం రాదు. మంచిదాకా యెందుకూ, మీ తాహతుని బట్టి కట్నం యిస్తేగాని అసలు సమ్మంధమే రాదు."

"నేను దమ్మిడీ యివ్వను. ఆమాట కూడా వినిపించుకోను."

రాధమ్మ విసిగిపోయి నుర్రాలక్కలాగ మొగం పక్కకి తిప్పుకుంది.

ఒక్కక్షణం యెవరూ యేమీ మాట్లాడలేదు.

మరోక్షణం చూసి, రాధమ్మ, కప్పుల్లో కాఫీ పోసి భర్తనీ, కూతుర్నీ మేజాదగ్గిరికి పిలుస్తూ తానొక కుర్చీమీద కూచుంది.

కాఫీ పుచ్చుకొని, తల్లి "నే నిస్తా నుండవమ్మా" అంటూవుండగా తల్లికీ తండ్రికీ తాంబూలా లిచ్చి తాను కూడా వేసుకొని కృష్ణవేణి పాఠశాలకి వెళ్లిపోయింది.

రాధమ్మ వొక్కక్షణం యేమిటో ఆలోచించి "నే నొక్కటి చెబుతాను వింటారా?" అంటూ తన కుర్చీ యాజులుకుర్చీదగ్గిరికి లాక్కుంది.

3

కృష్ణవేణి బి. ఏ. పరీక్షలో నెగ్గి రెండేళ్లయింది. మద్రాసు క్వీన్ మేరీ కాలేజీలో ఆమె ప్రతిభా, చాకచక్యమూ చూసి ప్రిన్సిపాలు ఆమెని కన్నకూతురులాగ ప్రేమించింది. పట్టంపుచ్చుకుని ఆమె రాజమండ్రీ వచ్చేస్తూవుంటే "నేను నిన్ను విడిచిపెట్టలేను. నిన్ను ఎం. ఏ. ప్యాసు చేయించి యీ కాలేజీలో నాకు చేదోడువాదోడుగా వుంచుకొంటాను, వెళ్లిపోకు" అని చాలాచాలా నచ్చచెప్పింది. బతిమాలింది; కాని కృష్ణవేణి వినలేదు. "నేను ఎం. ఏ. ప్యాసయితే యేం వస్తుందీ? నే నీ కాలేజీలో ఉపాధ్యాయురాలుగా చేరితే నా దేశీయస్త్రీల కెంతమందికి జ్ఞానదానం చెయ్యగలనూ? మీకు కోపం వద్దు. ప్రస్తుత విద్యావిధానం బాగా లేదు. ప్రత్యేకజన్మ యెత్తినవాళ్లకే గాని కాలేజీలలో ప్రవేశం లేదు. ప్రవేశం దొరికినవాళ్లేనా అందరూ వుద్యోగాలకోసం ఆశించి వచ్చేవాళ్లే. ఇది నాకు నచ్చలేదు. మావూళ్లో నేనొక పాఠశాల నడుపుతాను. ప్రారంభోత్సవం మీరే జరిగిస్తురుగాని. నా విద్యావిధానం అప్పుడు మీకు తెలుస్తుంది" అని ఆమె బదులు చెప్పింది.

ప్రిన్సిపాలు ఆమెని సంతోషంతో దీవించి పంపించింది.

ఆమె ఇంటర్మీడియేటు చదివేటప్పుడు యాజులు వివాహసంకల్పం చేశాడు; కాని ఆమె "చదువు పూర్తికానివ్వండి నాన్నారూ" అని కోరగా ఆ ప్రయత్నం ఆక్షణంలోనే కట్టిపెట్టేశాడు.

ఆమె బి. ఏ. అయి యింటికి వచ్చాక ఆమె నాశించి యేడెనమండుగురు యువకులు వచ్చారు; కాని ఆ సమ్మంధాలు చివరికి రాధమ్మకేనా నచ్చలేదు.

ఇది యిలా జరుగుతూవుండగా కృష్ణవేణి తన వుద్దేశాలు స్త్రీలోకంలో వ్యాపింపచెయ్యాలని వొక పాఠశాల నెలకొల్పింది.

యాజులు, తన పెన్షను ఎనిమిది వందలలోనూ "నీ యిష్టం వచ్చినట్టు చేసుకో" మని కూతురికి, నెలకి రెండు వందల రూపాయ లిస్తూవుండడానికి ఏర్పాటు చేశాడు.

ఆమె ఆ డబ్బుతో నెలకి యాభై, ముప్ఫయి, యిరవై రూపాయల జీతం చొప్పున ముగ్గురు వుపాధ్యాయురాళ్ల నేర్పరిచింది. ఆడ నౌకరుకి నెలకి పది రూపాయలు. చిల్లర ఖర్చులు నలభై రూపాయలు. ఇలాగ తండ్రి తన కిచ్చే రెండు వందలలోనూ ఆమె పాఠశాలకోసం నూట యాభై ఖర్చు పెడుతుంది. తతిమ్మా యాభయ్యీ తాను పుష్కలంగా వాడుకుంటుంది.

కూతురు చేసిన యేర్పాటు చూసి, యాజులు "ధన్యుణ్ణి" అని వుప్పొంగిపోయాడు.

కొంచెం యింగ్లీషు, అంతకంటే యెక్కువ తెనుగు, ఇంతే పాఠశాలలో ఆమె ప్రవేశపెట్టిన భాషా పరిమితి. స్త్రీలు, అవసరమయితే పురుషులలాగ స్వతంత్రంగా బతకాలని ఆమె ముఖ్యోద్దేశం.

"దయవుంచి నన్ను పెళ్లిచేసుకో. నన్నుద్ధరించు అంటూ స్త్రీ పురుషుణ్ణీ, పురుషుడు స్త్రీనీ బతిమాలుకో నక్కరలేదు. ఏమంటే? స్త్రీ అవసరం పురుషుడికి వుంది. పురుషుడి అవసరం స్త్రీకి వుంది. కనక స్త్రీపురుషసంబంధమైన ఆకర్షణకి మనుష్య ప్రయత్నాలేమీ అక్కర్లేదు. ఇప్పటి తెనుగు స్త్రీలు పురుషులకంటే నికృష్టంగా వున్నారు. వాళ్లకి దేశం అంటే తెలవదు. జాతి అంటే తెలవదు. భాష అంటే తెలవదు. మతం అంటే తెలవదు. ధైర్యంగా వీధిలోకే రాలేరు. ఇది మార్చాలి" ఇదీ ఆమె విద్యాప్రణాళిక.

ఇందుకోసం ఆమె, ప్రపంచంలో గొప్పపనులు చేసిన స్త్రీల చరిత్రలన్నీ సంపాదించింది. స్త్రీల స్వత్వాలను చక్కగా నిర్వచించి వాటిని తమ జీవితకాలంలో అమలుజరిపి ప్రపంచాని కాదర్శభూతురాళ్లయిన స్త్రీల జీవితాలు కూడా సంపాదించింది. అవన్నీ తాను స్వయంగా తెనుగులో రాసింది. కొన్ని ప్రకటించింది. కొన్ని అచ్చులో వున్నాయి. అవే ఆమె తరగతుల వారీగా తన పాఠశాలలో బాలికలకు పాఠ్యాలుగా నిర్ణయించింది. దానికి తగిన లెక్కలు, భూగోళం, చరిత్ర, భాష, ప్రకృతిశాస్త్రాలు, సంఘపుకట్టుబాట్లు, ముఖ్యంగా ఉదయమూ, సాయంత్రమూ వ్యాయామం.

ఆమె పాఠశాలకోసం వొక గుర్రాన్ని సంపాదించింది. నాలుగు సైకిళ్లు, ఒక (తన సొంత) మోటారు వున్నాయి. గుర్రపు స్వారీ, సైకిలెక్కడం, మోటారు నడపడం—ఇవి ఆమె ప్రతీపిల్లకీ కచ్చితంగా నేర్పుతుంది.

ఆ పాఠశాలలో చదువుకునే బాలికలు చాలామంది దర్జాగా సొంత సైకిళ్లమీద వస్తారు. వారిని చూడగానే రాజమండ్రీ పోలీసులు జనసమ్మర్దాన్ని చక్కగా సద్దుతారు.

మున్సిపాలిటీతో పోరి, గవర్నమెంటుకి రాసి, ఆమె, గోదావరివొడ్డున నాళంవారి సత్రంరోడ్డుకి కిందుగా యాభై గజాల రేవు సంపాదించింది. మున్సిపాలిటీవారే దానికి దక్షిణానా, వుత్తరానా ముళ్లతీగలతో దళ్లుకట్టించి హద్దులేర్పరిచారు. ఆమె ప్రతీ రోజునా వుదయమూ సాయంత్రమూ ముత్తాము తాలుగా పిల్లలను తీసుకువచ్చి యీతకొట్టిస్తుంది. ఆ సమయంలో

అక్కడ ఒక పోలీసువుండి కాపలాకాస్తూ వుండేటట్టు జిల్లా మాజస్ట్రేటు ఆర్డరువేశాడు. అక్కడ పడవ లాగ వుండా చెయ్యడం, నీళ్ళకోసం గాని స్నానాలకోసం గాని యెవర్నీ అక్కడికి రాకుండా చూడడం, పురుషులు చూడడానికి రాకుండా ఆపడం—ఇవీ ఆ పోలీసు పనులు.

పెద్దపెద్దలంతా ఆమెపాఠశాలను దీవించారు. గొప్ప పత్రికలు కొన్ని ఆమెయేర్పాట్లను ప్రశంసించాయి; కాని, చిత్రం. ఆ పాఠశాలలో బ్రాహ్మణ బాలికలు అయిదుగురు మాత్రమే వున్నారు. తతిమ్మా అందరూ—అంటే క్షత్రియబాలికలు పదిహేనుగురు. వైశ్యబాలికలు ఇరవైమంది. తెలగాలు, కమ్మవారు, కొప్పు వెలమలు—ఇత్యాదులు డెబ్భయ్యిద్దరు.

ఉదయం మూడుగంటలూ, మధ్యాహ్నం మూడు గంటలూ, ఆమె పాఠశాలలో చెమట వోడే లాగ పని చేస్తుంది. అక్కడి పనులన్నీ మార్షల్‌లా ప్రకారం నడుస్తాయి. ఎక్కడా చమ్చ పనికిరాదు.

పాఠశాలగంటల్లో స్త్రీలుమాత్రం వెళ్లి గాలరీలలో నిశ్శబ్దంగా కూచుని వినీ, కనీ బాగుపడవచ్చు.

చాలామంది వస్తానూ వుంటారు.

అప్పుడప్పుడామె వీరేశలింగంగారి టవున్ హాల్లో వుపన్యాసా లిస్తూవుండడంకద్దు. అయితే, ఆమె నోరు విప్పిందంటే ప్రకృతజీవచ్ఛవసంఘంమీద అగ్గి రాలుతూ వుంటుంది:

౪

మధ్యాహ్నం వొంటిగంటవేళ కృష్ణవేణి ఒక పుస్తకం తాలూకు ప్రూఫులు దిద్దుతూవుండగా యీజులు వచ్చి ఆమెకి వొక వుత్తరం యిచ్చాడు.

అందులో యిలా వుంది.

"బ్రహ్మశ్రీ, మహారాజశ్రీ చేబోలు రామచంద్రయాజులు పంతులు రిటైర్డుజిల్లాజడ్జీగారి సన్నిధికి-
రాజమండ్రీ

అయ్యా! అనేకనమస్కారాలు.

తమ రెరిగివున్న మద్దూరి వేణుగోపాలశాస్త్రీ నేనూ స్నేహితులం.

తమ అమ్మాయి కృష్ణవేణిగారికీ తనకీ వివాహం స్థిరపడివుండినట్టూ; కాని ముహూర్తం వుంచడమే తరవాయిగా వుండగా కట్నంవిషయంలో పేచీవచ్చి సంబంధం తిరిగిపోయినట్టూ, తాను, అదివరకే రెండువేల కట్నమూ, అయిదు వందలు లాంఛనాలూ యిస్తామని తరిమి తరిమి చెబుతూ పట్టుకు పాకులాడుతూ వున్న మరొక సమ్మంధం వెంటనే స్థిరపరుచుకున్నట్టూ, ముహూర్త నిశ్చయం కూడా అయినట్టూ ఇప్పుడే చెప్పివెళ్లాడు.

నే నీవుత్తరం తమకి రాయడానికి ఈ విధంగా కారణమూ, అవకాశమూ కలిగాయి.

నేను మీ అమ్మాయిగారిని పెళ్లిచేసుకోవాలని అభిలషిస్తున్నాను.

నన్ను మీ రెరుగుదురు. మీ అమ్మాయిగారున్ను యెరిగేవుంటారని నమ్ముతున్నాను.

నా పేరు సుసర్ల కోటీశ్వరశాస్త్రి. మా స్వస్థలం అమలాపురం తాలూకా మోడేకుర్రు గ్రామం. నేను బి. ఏ., ఎల్. టి. పరీక్షలలో నెగ్గివుండి, ప్రస్తుతం రాజమండ్రీ మునిసిపల్ హైస్కూల్లో ఆక్టింగుగా పనిచేస్తున్నాను. నెలకి అరవై రూపాయ లిస్తున్నారు.

ఇది యెప్పుడు ఖాయం అవుతుందో చెప్పలేను; కాని యీ ఆక్టింగుమాత్రం యింకా కొన్ని సంవత్సరాలు జరుగుతుంది.

నాకు భూములమీద సంవత్సరానికి రెండు వందల రూపాయలు మాత్రమే వస్తాయి. స్వగ్రామంలో చిన్న పెంకుటిల్లు వున్నది.

నావయస్సు: ముప్ఫయి రెండోయేడు మొన్ననే జూలైలో ప్రవేశించింది.

రెండేళ్లకిందట నా మొదటిభార్య గతించింది. సంతానం యేమీ లేదు. కలగనేలేదు.

అరవైయేళ్ల అమ్మగారూ, నలభైయేళ్ల వితంతు సోదరీ, నేనూ—ఇంతే మాయింటో జనం.

నాకు కట్నం అక్కర్లేదు. లాంఛనాలు పనిలేదు. పెళ్లికి నేను ఖర్చుచెయ్యదలచిన—కలిగిన పెద్ద మొత్తం నూరు రూపాయలు.

నా యోగ్యత తమకి అందరికీ నచ్చి, నా స్థితి విషయంలో కూడా సంతృప్తి కలిగితే నేను తమ అమ్మాయిగారిని పెళ్లిచేసుకోవాలని ఆశతో వున్నాను.

నేను రేపు మధ్యాహ్నం రెండు గంటలవేళ తమ దర్శనానికి వస్తాను.

నావిషయంలో తమకి ఆలోచన కలుగుతుందా, లోపలికి రమ్మనండి. లేకపోతే దర్శనమే యివ్వవద్దు.

దర్శనం యిచ్చినీ, తమకి కావలసిన వివరాలన్నీ తెలుసుకోడానికీ, అప్పకు కూడా యిష్టం కలక్కపోతే తిరస్కరించడానికీ నా ఆక్షేపణ యేమీ లేదు.

రాజమండ్రి,　　　　　　ఇట్లు విధేయుడు,
౨౩-౧౧-౧౯౩౫　　　　సుసర్ల కోటీశ్వరశాస్త్రి."

ఉత్తరం పూర్తిచేసి, కృష్ణవేణి "వారిని మీ రెరుగుదురా నాన్నారూ ?" అని అడిగింది.

"ఎరుగుదును. టెన్నిస్ ఆటలో చాలా నిపుణుడు. నిరు డీవూళ్లో జరిగిన పోటీలో నెగ్గాడు. అతన్ని సత్కరించడానికి విద్యార్థులు చేసిన సభకి నేనే అధ్యక్షత వహించి, విద్యార్థుల కానుక నూరు రూపాయల టెన్నిస్‌బాటు నా చేత్తోటే యిచ్చాను."

"అమ్మ యేమంటుందో ?"

"ఈ వుత్తరం ఆమె కూడా చూసింది. ఆస్తి బొత్తిగా తక్కువ అంటుంది మీ అమ్మ. అయినా పూచీ మనయిద్దరిమీదా వుంచుతోంది."

కృష్ణవేణి మొగం వంచుకుంది.

"అతను వస్తానన్న వేళ కావచ్చింది. నీవుద్దేశం యేమిటి తల్లీ ?"

"ఎల్. టీ. అంటే అయి యెన్నాళ్లయి వుంటుందో వూహించారా ?"

"తెలుసు."

"అప్పణ్ణుంచీ స్థిరమైన వుద్యోగం దొరకలేదన్నమాట."

"అంతే."

"వారి రూపురేఖ లెరుగుదును. చురుకైనవారే. ప్రతిభావంతులనే అనుకున్నాను. మీ కేమీ ఆక్షేపణ లేకపోతే దర్శనం యివ్వవచ్చు."

"వారు కోనసీమస్వాములు. ఆలోచించావా ?"

"అయినా ! వారికి ముందు మనమరతులు నచ్చాలి కదా ?"

"సరే."

"దర్శనం యివ్వండి."

"ప్రస్తుతం అమలులో వున్న లాలో యెక్కడా లేని పాయంట్లు యెత్తుతారు వారు."

"జడ్జీ అనాధ అయితేనూ. అంతేనా నాన్నారూ ?"

యాజులు చిరునవ్వు నవ్వాడు.

"నా అభిప్రాయం అమ్మకి చెప్పి, ఆమె యిష్టపడితేనే దర్శనం యివ్వండి నాన్నారూ."

"అలాగే నమ్మా."

ఇలా అంటూ యాజులు లోపలికి వెళ్లాడు.

కృష్ణవేణి ప్రూఫుల పని ముగించి, టేబిలుమీద వున్న యేలకిపం డొకటి వొలిచి నోట వేసుకుంది.

ఇంతలో యాజులూ, రాధమ్మా అక్కడికి వచ్చారు. అప్పుడే నౌకరు వచ్చి అతని కొక చీటీ యిచ్చాడు.

అది కోటీశ్వరశాస్త్రి విజిటింగు కార్డు.

"రమ్మను" అని యాజులు నౌకరుతో చెప్పాడు.

"ఆస్తి బొత్తిగా తక్కువమ్మా" అంది రాధమ్మ.

"బుద్ధివుంటే అదీ అక్కర్లేదు" అంది కృష్ణవేణి.

ఇంతలో కోటీశ్వరశాస్త్రి వచ్చి నమస్కారం చేశాడు. అందరూ లేచారు. యాజులు స్వాగతం చెప్పి "అలా దయచెయ్యండి" అని కుర్చీ చూపించాడు.

అందరూ కూచున్నారు.

యాజులు ప్రారంభించాడు.

"కట్నం విషయం మీరు పూర్తిగా తెలుసుకున్నారా?"

"అది తమ రందరూ ప్రిన్సిపలుగా స్థిరపరుచుకున్నట్టు నేను స్పష్టంగా తెలుసుకున్నాను. నాకున్నూ ఆ ప్రిన్సిపలు యిష్టమే."

"నాకు కృష్ణవేణి వొక్కర్తే సంతానం. నా ఆస్తి కంతికీ ఆమే ఉత్తరవారసు. నేను దత్తత చేసుకో దలుచుకోలేదు."

"చిత్తం."

"నాది రెండు లక్షల రూపాయల ఆస్తి. బతికి వున్నంత కాలమూ నాకు పెద్ద పెన్షను వస్తుంది; కాని యిందులో మీ కేమీ స్వాధీనపడదు."

"ఇష్టపడ్డాను."

"మీ కిప్పటి కింకా స్థిరమైన వుద్యోగం లేదు. ఉద్యోగంకోసం మీరు మరోచోటికి వెళ్లవలసిన అవసరం కలగవచ్చు; కాని మా అమ్మాయి యీ వూరు విడిచి యెక్కడికీ రాదు."

"అది కొంచెం కఠినమైన షరతే. అయినా ఇష్టపడ్డాను."

యాజులు కృష్ణవేణమ్మకేసి చూడగా ఆమె అందుకుంది.

"నే నొక పాఠశాల నడుపుతున్నాను. స్త్రీల జీవితానికి విలువ కలిగించాలనే వుద్దేశంతో అది నడుపుతున్నాను. నా జీవితం దానికోసం ధారపొయ్యాలని నా వ్రతం."

"సంతోషం."

"ఒకటి, నా భర్త. రెండు, నా తల్లిదండ్రులు. మూడు నా పాఠశాల. నా ప్రేమా, శ్రద్ధా ఈ మూడు వస్తువులమీదా యథార్థంగా వినియోగపరుస్తాను."

"బోధపడింది. చాలా సంతోషం."

"భార్య అంటే బానిస కాదు. సమానభాగస్వామిని. నా హక్కులు నేను పూర్తిగా అమలు పరుచుకుంటాను."

"మీ ధోరణి బోధపడింది. అంగీకరించాను."

"భర్తవెంపువారిని నేను భక్తితో పూజిస్తాను. అయితే: వారు నన్ను ప్రేమిస్తేనే ఇది జరుగుతుంది."

"సరే."

"అవసరం వచ్చిం దని నాకు తోచినప్పుడు గృహిణికి వుండవలసిన అధికారా లన్నీ నేను దఖలు పరుచుకుంటాను."

"అలాగే చెయ్యవచ్చు."

"సభలకి వెళ్లడమూ, పురుషులతో కలిసికూడా కూచోడమూ నాకు అలవాటుంది."

"ఒప్పుకున్నాను."

"నే నొక్కర్తెనే పొరుగూళ్లు వెళ్లడం కూడా వుంది. ఇకముందున్నూ వెళ్లవలసిన అవసరం వుంటూనే వుంటుంది."

"వెళ్లవచ్చు."

కృష్ణవేణి తల్లికేసి చూసింది. రాధమ్మ అందుకుంది.

"మీ అమ్మ, మీ అక్క రజస్వల అయిన పిల్లచేతి అన్నం తింటారా?"

"రెండు పూట్లా వారే వంట చేస్తారు. మీ అమ్మాయి పొయ్యిదగ్గిరికి వెళ్లవలసిన అవసరం కలగదు. అలాంటి అవసరమే వస్తే అప్పుడు సిద్ధపడుతామన్నారు."

"మరి తతిమ్మా సంగతులు?"

"అవును. మేము అనుకోని కొత్త సంగతులు కొన్ని యిప్పుడు వచ్చాయి. అవేవీ వారికి సంబంధించినవి కావు. అయినా వారితో చెబుతాను. అంగీకరిస్తారనే నా నమ్మకం."

కృష్ణవేణీ, రాధమ్మ యాజులుకేసి చూశారు. అతను "మీరు బాగా ఆలోచించుకుని కబురుచెయ్యండి" అన్నాడు.

"మా అమ్మ, మా అక్క సాయంత్రం అయిదు గంటల కిక్కడికి వస్తారు. మూడు వంతులు వారు సమ్మంధం స్థిరపరచడానికే వస్తారు. నేను మాత్రం మనస్ఫూర్తిగా అంగీకరించాను."

అందరూ లేచారు.

కోటేశ్వరశాస్త్రి మళ్లీ నమస్కారం చేసి, సెలవు పుచ్చుకుని వెళ్లిపోయాడు.

*

సాయంత్రం సరిగా అయిదుగంటల వేళ కోటేశ్వరశాస్త్రి తల్లీ, సోదరి రాజమ్మ వచ్చారు. రాధమ్మ వారిని, రోడ్డుమీద బండిదగ్గిరికి వెళ్లి ప్రత్యుత్థానంచేసి యింటోకి తీసుకువెళ్లి చాలా మర్యాదలు చేసింది. ఆమె నిరాడంబరతా, కలుపుగోలుతనమూ వారికి చాలా ఆశ్చర్యం కలిగించాయి.

కొంచెంసేపు కూచున్న తరవాత రాధమ్మ వారికి కూతుర్ని చూపించింది. ఇల్లంతా చూపించింది. కాలింగుబెల్ వాయించి యాజుల్ని పిలిచింది.

యాజులు రాగా అందరూ లేచారు.

మళ్లీ కూచున్నారు.

యాజులు రిస్టువాచీ చూసుకున్నాడు. అది కనిపెట్టి రాజమ్మ తల్లితొడ గిల్లింది.

"అన్నయ్యగారూ! మా అబ్బాయి ఇక్కడి సంగతులన్నీ చెప్పాడు. మా కేమీ ఆక్షేపణ లేదు. మా స్థితిగతులు మా అబ్బాయి చెప్పే వున్నాడు. తమకి అంగీకారం అయితే ముహూర్తం స్థిరపరిపించవచ్చు" అంది ముసలమ్మ.

యాజులూ, రాధమ్మ, కృష్ణవేణీ ఒకరి నొకరు చూసుకున్నారు. ఆహా లంతా వింత తేజస్సు ఆవరించింది.

"రేపు ఉదయం పురోహితులవారిని మీయింటికి పంపుతా" నన్నాడు యాజులు.

"అత్తయ్యగారూ! మీ అమ్మాయి చేతి అన్నం తినడంమాట తెచ్చారుట మీరు. మే మిద్దరం వుండగా మీ అమ్మాయి వంటచెయ్యవలసిన పనేమిటి? కాక పోయినా, ఆమెని మాతమ్ముడికి చేసుకుంటే వొకటీ, ఆమెచేతి అన్నం తింటే వొకటీనా? ఇంతకీ: పెళ్లి అయాక మేము మీ యింటికి వచ్చి మీరు వడ్డిస్తే భోజనం చెయ్యమూ? కనక ఆశంక మాకూ లేదు, ఆ సందేహం మీకూ వద్దు" అంది రాజమ్మ.

వియ్యపురా ళ్లిద్దరూ "ఎప్పటి కెలాగో అలాగ సద్దుకోకపోతే యెలాగండీ?" అంటూ బుగ్గలు నొక్కుకున్నారు.

* *

డిసెంబరు మూడో తేదీని కృష్ణవేణికీ, కోటేశ్వరశాస్త్రికీ వివాహం అయింది.

తంతు అంతా రెండు గంటలలో పూర్తి అయిపోయింది.

రాధమ్మ, యాజులుగార్లు తమ జీవితకాలంలో తాము చెయ్యవలసిన శుభకార్యం యిదొక్కటే అయినా చాలా నిరాడంబరంగా చేశారు.

ఆవేళ, మధ్యాహ్నం మూడు గంటల వేళ, యాజులు, తనకి పరిచితులయిన వూరిపెద్ద లందరికీ టీపార్టీ యిచ్చాడు.

సాయంత్రం అయిదుగంటలవేళ, రాధమ్మ తనకీ కృష్ణవేణికీ పరిచితురాళ్లయిన స్త్రీల కందరికీ టీపార్టీచేసి పసుపూ, కుంకుమా, పట్టు రైకల గుడ్డలూ యిచ్చి సత్కరించింది.

పాఠశాలలో వున్న వుపాధ్యాయురాళ్లకీ, విద్యార్థినులకూ మాత్రం వరసగా మూడురోజులు రెండు పూటలూ పిండివంటలతో భోజనాలు పెట్టారు.

అంతే.

అయిదో తేదీని పునస్సంధానం. అయిదు, ఆరు, ఏడు లేదు, ఎనిమిదో తేదీ సాయంత్రం కృష్ణవేణిని అత్తవారి యింటికి పంపారు.

౬

"తమ్ముడూ !"

అతనికి మెళుకువ రాలేదు.

"ఒరేయ్ !"

పలకలేదు.

"శాస్త్రీ !"

ఎవరో!

గట్టిగా పిలిస్తే మరిలికి ఎక్కడ వినపడిపోతుందో అని ఆమె కంఠం నొక్కుకుని మళ్లీ పిలిచి కదిపింది. అతను గోడవేపుకి వొత్తిగిల్లాడు.

మళ్లీ కదుపుతూ, చెవిలో నోరుపెట్టి "వొరేయ్, అబ్బాయీ" అని పిలిచింది.

"అబ్బా !......ఎందుకే ?" అన్నాడతను ముసముస లాడుతూనూ. అతని కళ్లు చింతనిప్పుల్లాగ వున్నాయి; కాని మసకచీకట్లో అది ఆమెకి తెలవలేదు.

"ఏడు గంట లయిపోయిందిరా అప్పుడేనూ"

"ఏమంటావ్ ?

"నీ పెళ్లాం లేవడమే కాకుండా మొగం కడుక్కుని, స్నానం చేసి—"

"అయితే?"

కాఫీకి నీళ్లుకూడా కాస్తోందిరా?

"పాలూ, పంచదారా, డికాక్షనూ కలిపాటప్పటికి నేను సిద్ధంకాలేనంటావా యేమిటి ?"

"బాగానే వుంది. అది స్నానం కూడా చేసి చక్కగా ముస్తాబై కాఫీ పుచ్చుకుంటూవుంటే నువ్వు పాచిమొగంతో—"

"అబ్బ ! నువ్వు చంపుతావే "

"ఇలా అయితే నువ్వు లోకువఅయిపోవుట్రా?"

"సింగినాదం కాదూ ?"

విసుక్కుంటూ యిలా అన్నాడు; కాని ధైర్యం చాలక లేచి కూచున్నాడు. కళ్లు మాత్రం తెరవలేదు.

"శే. తొరగా మొగం కడుక్కో. అది చన్నీళ్లే పోసుకుంది; కాని నీకు వేన్నీళ్లు కాచాను."

"తొరువు."

"అదెంతసేపు రా ?"

"నువ్వు చన్నీళ్లు తోడాటప్పటికి నేను మొగం కడుక్కోలే నంటావా యేమిటి ?"

"మరి మంచం దిగు."

"నువ్వు ముందు పదవే."

అతను లేచి బట్ట సవరించుకుంటా డేమో అని రాజమ్మ బయలుదేరింది; కాని గుమ్మందాకా వచ్చి యిట్టే వెనక్కి తిరిగిచూడగా అతను మంచం దిగకపోవడమే కాదు, పైగా మళ్లీ వొరుగుతున్నాడు

అది చూసి, రాజమ్మ, వొళ్లు మండగా, వొక్క అంగలో మళ్లీ దగ్గిరికి వెళ్లి, సగం వొరిగినవాణ్ణి సగంలోనే పట్టుకుని "వొరేయ్ ! నీకు బుద్ధి వుందా లేదా? ఇందాకణ్ణుంచి చిలక్కి చెప్పినట్టు చెబుతూవుంటే అంతా అరణ్యరోదనమే ?" అని కొంచెం గదిమింది.

"ఇంత పెందలాడే లేస్తే తరవాత నాకు తలనొప్పి వస్తుందే. రోజంతా మత్తుగా కూడా వుంటుంది వెధవది."

"ఏమయినా సరే, తొమ్మిదయ్యేదాకా పడుకుంటే యిక సాగదు. ఆడదానికి చులకన అయిపోయాడంటే మొగాడు మరి గుడ్డిగవ్వకి మారడు."

కళ్లు మూసుకునే వుండి, వొక్క జోగు జోగి, అంతలో వులిక్కిపడి, కళ్లు తెరుచుకుని "హు...... పద అయితే" అంటూ అతను మంచం దిగాడు. ఇక ఫరవా లే దనుకుని రాజమ్మ గబగబా వెళ్లిపోయింది.

వెడుతూ వెడుతూ ఆమె వంటింటి వసారాకేసి వోరకంటితో చూడగా, కృష్ణవేణి, ఫిల్టరులో వుడుకు నీళ్లు పోసి, పాలగిన్ని అప్పుడే కుంపటిమీద పెడుతోంది.

దీంతో మరీ కంగారెత్తగా, రాజమ్మ, వొక్క దూకున నూతిదొడ్లో అడుగు పెడుతూ వెనక్కి తిరిగి

చూసింది. గూట్లోవున్న గానుగుపుల్ల తీసి నోట పెట్టుకుని, శాస్త్రి, కొంచెం తూలుతూ వస్తున్నాడు.

*　　*　　*

శాస్త్రి పొడిబట్ట కట్టుకునేటప్పటికి, తాను తెచ్చిన తలనూనె చేతులకి రాసుకుని సిద్ధంగావున్న కృష్ణవేణి, అతనికి, నిమిషంలో తల దువ్వేసింది. అతను షర్టు తొడుక్కునేటప్పటికి తుంగచాప పరిచి తానొక చివర కూచుని కాఫీ కలిపింది. అతను కూడా కూచునేటప్పటికి కప్పులో పోసి, కాఫీ చేతికందించింది.

వీధిలో మోటారు హారన్.

శాస్త్రి వులిక్కిపడి చూశాడు.

"నా కోసం వచ్చింది కారు" అంది ఆమె.

మొదట అతనికి అర్థం కాలేదు; కాని ఒక్క స్పూను కాఫీ చప్పరించాటప్పటికి పాఠశాల సంగతి జ్ఞాపకం వచ్చి "ఊఁహూఁ" అంటూ తల వూపాడు.

"కాఫీ బాగుందా?" అంది కృష్ణవేణి

"చాలా బాగుంది. ఒకమాటు మద్రాసులో పుచ్చుకున్నా నిలాంటి కాఫీ. నాటికి నేను మళ్లీ దొరికింది."

"చాలా సంతోషం.........రోజూ యిలాగ చెయ్యవచ్చు నన్నమాట........."

".........ఇంకా అడగాలా?.........కాని నీకు శ్రమ........."

"ఇది శ్రమ కాదు, పరిశ్రమ......మీ రుచికి అనుగుణంగా తయారుచెయ్యగలనో లేనో అని చాలా భయపడ్డాను.........నిజంగా బాగుందా?"

ఆమె నవ్వుతూ అడిగింది. ఈషదుచ్ఛలితాలైన ఆమె నీమకమలాల లోఁకులు అతని మనస్సుని వూచేశాయి.

"ముఖప్రీతికోసం చెప్పిన మాట కాదు నాది. అన్నమూ, కూరలూ బాగా లేకపోయినా సద్దుకోవచ్చు; కాని కాఫీ సరిగా కుదరకపోతే మతి పోతుంది...... ......నేను నిజమే చెప్తాను. కాఫీ.........చాలా చాలా బాగుంది."

కృష్ణవేణిమొగమ్మీద ఉత్సాహం లాస్యంచేసింది.

మళ్లీ వీధిలో మోటారు హారన్.

"అక్కా" అని పిలిచాడు అతను గుమ్మంకేసి చూస్తూనూ. రాజమ్మ గుమ్మంపక్కనే పొంచివుండి వింటోంది; అయితే, పిలుపు వినపడేటప్పటికి పిల్లిలాగ పడమటింటి దాకా మునిగాళ్లమీద పరుగెత్తుకు వెళ్లి, అక్కడ గభీమని వెనక్కి తిరిగి, యేదో పనిలోవుండగా పిలుపు వినపడ్డదానిలాగ "పిలిచావా తమ్ముడూ?" అని అడిగింది.

కృష్ణవేణి "ఎందుకూ?" అన్నట్టు చూసింది; కాని అతనది గమనించకుండా "కాఫీ పుచ్చుకుంటున్నారని చెప్పిరా డ్రైవరుతోనూ" అన్నాడు.

"అక్కర్లేదండీ. వదినా, మీరు వెళ్లనక్కర్లేదండీ! తాను వచ్చి హాజరుగా వున్నట్టు రెండుమాట్లు హారన్ వేస్తాడు డ్రైవరు. అంతే."

రాజమ్మ అప్పటికప్పుడే వారి యెదటికి వచ్చింది; కాని మరదలి మాట విని వెనక్కి చక్కా పోయింది.

ఈ మాటు ఆమె గుమ్మంపక్కని పొంచి వుండకుండా, పడమటింటి గుమ్మంలోకి వెళ్లి తలుపు నానుకుని నుంచుంది.

తాను ఆలస్యంగా లేచినందుకే కృష్ణవేణి కొంచెం యిదవుతూ వుంటుం దనుకుంటూ వున్నాడు కనక, శాస్త్రి, కొంచెం తొందరగా కాఫీ పుచ్చుకోసాగాడు.

అది చూసి కృష్ణవేణి "మీరు తొందరపడుతున్నారు. అలాంటి దేమీ అక్కర్లేదు" అంటూ అతని కప్పులో మళ్లీ కాఫీ పోసింది.

ఆమెకూడా మళ్లీపోసుకుంటుందో పోసుకోదో అని చూసి, సందేహం తీరగా, అతను మళ్లీ కాఫీ పుచ్చుకోసాగాడు.

"మధ్యాహ్నం మీకు కాఫీమాట యేమిటి?"

"......కాఫీహోటల్లో పుచ్చుకుంటాను."

"రావడానికి వీలుండదూ?........."

"......సైకిలన్నా రానూ పోనూ రెండు మైళ్లు.........వచ్చినా, సావకాశంగా కూచుని పుచ్చుకోడానికి వీలుండదు..............పుస్తకమూ మనసూ గొంతుకలో పోసుకుని, పురుగులూ పరుగులూ—ఏమి సుఖమూ?............"

"పోనీ సైకిలుమీద పాఠశాలనౌకరుచేత ఫ్లాస్కుతో పంపనా;........."

".........అదికూడా సైకిలు తొక్కగలదా?"

".........తరుచు నాకారు అదే డ్రైవుచేస్తూ వుంటుంది."

"భేష్ !... ...... కాని ముందుముందు చూసుకుందాం. ప్రస్తుతం వద్దు."

ఇలా అంటూ అతను కప్పు కింద పెట్టాడు.

"సరిపోయిందా?" అంది ఆమె కూడా కప్పు కింద పెడుతూ.

"ఎక్కువే అయింది" అన్నాడతను, చెయ్యీ, మూతీ తుడుచుకోవడానికి జేబురుమాలు తీసుకో పోతూనూ.

అది కనిపెట్టి ఆమె "నీళ్లివిగో" అంటూ అతని చేతిలో కప్పిన్ని పోసె తాను కూడా చెయ్యి కడుక్కుంది

అతను లేచి టేబిలుదగ్గిర నుంచుని సొరుగు లాగాడు

కృష్ణవేణి, నిమిషంలో కప్పులూ, సాసర్లూ, స్పూనులూ కడిగితెచ్చి బీరువాలో వుంచి, వచ్చి అతని దగ్గిరగా నుంచుని "పాఠశాలకి వెళ్లవచ్చునా?" అని అడిగింది.

అప్పటికప్పుడే వొక యేలకిపండు వొలిచి తన నోట వుంచుకుని వున్న అతను, మరో పండు వొలిచి "సందేహం యెందుకూ?" అంటూ ఆమె నోటికి అందించాడు.

అప్పుడామె రెండుచేతులతోనూ అతని కంఠం పైనవేసి "ఒక్క నిమిషమేనా వేళ తప్పడం నా నియమానికి ప్రతికూలంగా వుంటుంది. దయచేసి...రేపణ్ణుంచి ......మీరు......" అని సుతారంగా తల ఆడిస్తూ కోకిలకూజితం మందరంలో లీనం చేసింది.

దానికి అతని మనస్సు మొదట గుబగుబలాడిపోయింది; కాని అంతలో దిటవు తెచ్చుకుని, అతను, రెండు చేతులతోనూ ఆమెని పొదివి పట్టుకుని, ఆర్డరు కాగితంమీద ఆఫీసు మొహరు వేసినట్టు ఆమె పెదవుల మీద వొక కమ్మని ముద్దు వుంచాడు.

ఇద్దరూ బయలుదేరి వీధిలోకి వచ్చారు.

మొగుడు మద్రాసులో బి. ఏ. చదువుతూ వుండగా పుట్టింట వున్న యెదటింటివారి ఆడబడుచు, ఏడుపిల్లను చంకను వేసుకుని కారు వచ్చినప్పణ్ణుంచీ వీధి గుమ్మంలో నుంచుని వుండి, వారిని చూడడంతోటే గిరుక్కున మళ్లీ తలుపుచాటున నక్కి తొంగిచూడ సాగింది.

కృష్ణవేణిని చూడడంతోటే డ్రైవరు కారు దిగి బయటికివచ్చి, తలుపుతీసి, ఆమె యెక్కి కూచున్న తరువాత మళ్లీ తలుపువేసి, వెంటనే వెళ్లి తన స్థానంలో కూచుని, స్టార్టుచేసి హారన్ వేశాడు.

కృష్ణవేణి భ్రూవిలాసంతో మొగుడి సెలవు పుచ్చుకుంది.

ఝోంయిమంటూ కారు వెళ్లిపోయింది.

౨

ఆవేళ మధ్యాహ్నం రాఘవమ్మ, యాజులూ, కృష్ణవేణీ యేకబంతిని భోజనాలకు కూచున్నారు. వంటలక్క వడ్డిస్తోంది.

"నిన్నరాత్రి అన్నం నోటికి పోలేదమ్మా" అన్నాడు యాజులు.

"అనుకుంటూనే వున్నాను నాన్నారూ! రాత్రి మా ఆడబడుచు వారికీ, నాకూ యేకబంతిని వడ్డించారు. కాని నాకు గూడా అమ్మా, మీరూ లేకుండా భోజనం చెయ్యడం యెలాగో అనిపించింది. రెండు మాట్లు కొలకమారింది—"

మాట పూర్తికాకుండా "చూశారా?" అంది రాధమ్మ. రాత్రి భోజనం దగ్గిర యాజులికి రెండు మూడుమాట్లు కొలకమారింది అప్పుడు రాధమ్మ "అమ్మాయి తలుచుకుంటోం దండీ" అంది. అది కూతురు మాటతో రుజువుచేసిం దిప్పుడు.

"భోజనం చేసినంత సేపూ మీ మాటే అనుకు న్నాను. ఎంతసద్దుకున్నా "నీమూలాన మీ అమ్మా మీ నాన్నా యీపూట - ఈ పూటేమిటి యిక తరుచు సగంసగమే భోంచేసి లేచిపోతారు తెలుసునా?" అని యెవరో గుచ్చి గుచ్చి అన్నట్టే వుందండీ"

"నాకేమన్మా? నేను కడుపునిండానే భోజనం చేశాను. మీ అమ్మ మీగడ పెరుగు మానేసి, చేసినమజ్జిగ పోయించుకుంది. సుభద్రమ్మ (వంటలక్క) ముందే నాకు పాలు పోసేసింది. లేకపోతే మీ అమ్మ పెరుగు మానేసినందుకు నేను కూడా పాలు మానేస్తును."

"అవునటే అమ్మా?" అంది కృష్ణవేణి చుఱగ్గా చూస్తూను.

"అబ్బే లేదమ్మా! రాత్రి కొంచెం అజీర్తిగా వుండి పెరుగు మానేశాను. అంతే. మీనాన్న మరీనూ మాటమీదమాట యిట్టే అల్లేస్తారు."

"వొట్టిదమ్మా! మీ అమ్మ చెప్పిం దంతా అబద్ధం. ఆమెకి అజీర్తి సుతరామూ లేదు. నాకు బాగా తెలుసు. నువ్వు బంతిని లేకపోవడం-పైగా నువ్వు నీ యింటికి వెళ్లిపోవడం - బెంగ తప్ప మీ అమ్మకి అజీర్తీ లేదు, మరేమీ లేదు."

"అయితే మీకుమాత్రం లేదా యేమిటి బెంగ?" అంది రాధమ్మ చురచుర చూస్తూ.

"నాకూ వుంది. ఎక్కువగా కూడా వుంది; కాని నీది తల్లిప్రాణం"

రాధమ్మ యీ మాటతో మనస్సు కలికేసినట్టయింది.

"సమ్మంధాలు రానంతసేపూ "అయ్యో యెలాగమ్మా" అనిపించేది. నిరుకైన సమ్మంధం తిరిగిపోతే ప్రాణం పోయినట్టయింది. ఆస్తి తక్కువయినా మళ్లీ యేదో సమ్మంధం వచ్చి స్థిరపడగా కొండయెక్కిన ట్టనిపించింది. కార్యం నాలుగురోజులూ వుబలాటం వురకలు వేసింది. నిన్న సాయంత్రం దాని యింటికి అది వెళ్లాలప్పటికి - వొక అయ్య చేతిలో పెట్టాక -"

రాధమ్మ మరి మాట్లాడలేకపోయింది. కళ్లల్లో బాష్పజలం గిఱ్ఱున తిరిగిపోయింది. పెదవులు రవిరే కల్లాక అల్లల్లాడిపోయాయి.

ఆమెస్థితి చూశాటప్పటికి యాజులుకళ్లున్నూ చెమ్మగిల్లాయి.

ఆ యిద్దర్నీ చూసి కృష్ణవేణి —

ముగ్గురూ భోజనాలు మానేసి పీటలికి చేరబడ్డారు.

ఇదంతా చూస్తూవున్న సుభద్రమ్మ తటాలున ముందుకి వచ్చి "ఆడపిల్లని కన్నవాళ్లకి యిదే బాధండీ బాబుగారూ! నానాబాధలూపడి పెంచి వొకరి యింటికి పంపెయ్యడం— కానయితే యిది యెవరికీ తప్పందే. మంగళకరం కాని యిది మరోటి కాదు కూడానూ కాని చెయ్యిపెట్టి కలిచేసినట్టయిపోతుంది మనస్సు. మా అమ్మాయి కాపరానికి వెళ్లిన కొత్తలో నేనూ యిలాగే బాధపడ్డాను. తరవాత అలవాటయిపోయింది. అమ్మాయి ఆరేళ్లనుంచి చనువు కావడంవల్ల నిన్న రాత్రినుంచీ నాకూ యెలాగో వుంది కన్నకడుపు మీమాట చెప్పే దేమిటి? అవతలివారు వారిని నెత్తిమీద పెట్టుకున్నా మనకి కండలో కండ కోసినట్టు—అమ్మాయీ! మీరు భోంచేస్తే గాని మీ అమ్మా మీ నాన్నా మరి మెతుకు ముట్టరు. చారు తెమ్మంటారా, పులుసా?" అని అడిగింది.

దీంతో అందరూ ప్రకృతిలో పడ్డారు.

భోజనాలు సక్రమంగా అయినాయి.

*　　*　　*　　*

కారు దిగి కృష్ణవేణీ, యెదటింటినుంచి వస్తూ రాజమ్మ వొక్కమాటె గుమ్మం యెక్కాడు.

"ఎక్కణ్ణుంచి వదినా?" అంది కృష్ణవేణి.

"ఎదటింటివారి అబ్బాయికి పెళ్ళివారు వచ్చారు. చూద్దామని వెళ్ళగా యిప్పటిదాకా కూచోపెట్టారు"

"పెళ్ళికొడుకువయస్సెంత?"

"పదహారో యేడు మొన్ననే వెళ్ళిందిట"

"పెళ్ళికూతురికి వుండవలసిన యీడేనా లేదు కదా అప్పుడే యేం పెళ్ళండీ ఆ పిల్లాడికి?"

"వూరికే, సమ్మంధాలు వచ్చి మీద పడిపోతూ వుంటే యేం చేస్తారూ? రెండు మాసాలలో యిది నాలుగో సమ్మంధం. కాకపోయినా, వారు శాస్త్ర ప్రకారం నడుచుకుంటారు. పిల్లాడితండ్రి వేదశాస్త్రాలు చదువుకున్నవారు; గాని వుద్యోగస్థులు కారు."

"అంత చిన్నతనంలో పెళ్ళి చెయ్యడానికి శాస్త్రం వొప్పుకోదే? అయినా పెళ్ళికూతురి వయస్సెంత?"

"మొన్ననే తొమ్మిదో యేడు-"

"ఛీ ఛీ!"

కృష్ణవేణి శాంతంగా మాట్లాడలేకపోయింది.

"అవతలివారు మనుష్యులా రాక్షసులా వదినా? కన్న కూతురి గొంతుకు కోసెయ్యడానికి చేతు లెలా వస్తాయండీ వాళ్ళకీ?"

రాజమ్మ మాట్టాడలేకపోయింది. అప్పటికప్పుడే వారు పడమటింటి దగ్గిరికి వచ్చారు.

తుంగచాప పరుచుకుని ముసలమ్మ అక్కడ కూచుని వుంది. ఆవిడ అదరంతో "రా అమ్మా" అని కోడలిని ఆహ్వానించి, కూచో మని చాప చూపించి "ఏమాయిం"దని కూతురి నడిగింది.

"కట్నం ఆరువేలకి దమ్మిడీ తగ్గమన్నారు అవధానులుగారు. ఆడబడుచులికి ఆరుగురికీ ఆరు వందలూ, వియ్యపురాలికి రెండు వందలూ, తాపితాలూ వెండి సామానూ-వీటి కోసం పెళ్ళికొడుక్కి మూడువందలూ- మొత్తం లాంఛనాలు పెయ్యన్నూట పదహార్లడిగారు.

"బాగానే అడిగారు.........అవును. వారికేం లోటూ? పదివేలయినా అడగతగ్గవారే"

"కొడుకుని అమ్ముకోడానికి ఏ శాస్త్రం అధికారం యిచ్చిందో అవధానులుగారికి? అంది కృష్ణవేణి.

"డబ్బు వచ్చేచోట శాస్త్రం పట్టుకు కూచుంటారా యేమిటి యెవరేనా? ఆయన ఆరుగురు అల్లుళ్ళకీ ఆరువేలు కట్నం యిచ్చారు. అదంతా యీ వొక్క కొడుకు పెళ్ళికీ రాబట్టాలని నిరుకుచేసుకున్నారు. వస్తుంది కూడానూ. వారికేం, రాక, ముప్ఫయి నలభై వేలు వడ్డీమీద తిరుగుతూ వుండగానూ? పైగా వొక్కగా నొక్క కొడుకు. ఆరుగురు కూతుళ్ళ వెనక గారాల కూచమ్మ"

"చివరకి యెలాగేనా కూచమ్మే అయిపోతాడు ఆ పిల్లాడు. అయితే, యీ ఆస్తి అంతా అవధానులుగారిలాగే సంపాదించారనుకుంటాను. ఎందుకు వచ్చిన చదువు? ఎందుకు వచ్చిన యేళ్ళు? ఆరు వేలు కట్నమా? అవతలివారు దీంతో యేట్లో కలిసిపోవలసిందేనా?"

"వారికేం? వారికీ యీ పైవేల వడ్డీవ్యాపారం వుంది."

"అదే కృత్తా వారికి?"

"బెజవాడలో పెద్ద బరంకు షాపు వుందిట వారికి"

"సెబాస్! చాలా బాగుంది వదినా! జపంచేసుకోడానికి అవధానులుగారి కిక పిపాటతోటే సప్లయి. బహుశా, మొగపెళ్ళివారిలో ఆడాళ్ళకీ మొగాళ్ళకీ కూడా మనిషికి రోజుకి వొక సీసా చొప్పున దాహం యివ్వాలని కూడా అవధానులుగారు కోరే వుంటారు. ఛీ! ఎందుకు వచ్చిన బ్రాహ్మణ్యం వదినా? ఆపెళ్ళిమాట చెప్పకుంటే మన నోళ్లు కూడా చెడిపోతాయి వూరుకోండి."

నోరెత్తలేక రాజమ్మ వీధిగుమ్మం కేసి చూసింది. అదేమిటో అని కృష్ణవేణి అలా చూడగా, గుమ్మంలో

నుంచే కోటు తీసేసుకుంటూ కోటేశ్వరశాస్త్రి వస్తున్నాడు.

కృష్ణవేణి, వెంటనే లేచి, యెదురువెళ్లి, ఆ కోటు అందుకుని, మొగుడితో కూడా గదిలోకి వెళ్లింది.

"కట్నం అనేటప్పటి కెంత కోపం వచ్చిందో చూశావా?" అంది సన్నని గొంతుకతో రాజమ్మ, కళ్లు తిప్పుకుంటూనూ.

"పోనీవే. బి. ఏ. చదివినా అబ్బాయి కనపడేటప్పటికి యెదురువెళ్లి కోటు అందుకుంది. పాడు కట్నం పోనిస్తూ" అంది ముసలమ్మ.

"కట్నం విలవ నీకేం తెలుసునూ; ఎక్కడో జల్లిసీమలో పుట్టి యెగిరివచ్చి మాయింటో పడ్డావు."

"పోదూ నేర్చుకుపోయావూ"

"పోతా నోయ్! డబ్బు చేదా యేమిటమ్మా? ఎందుకూ, శమ్ముడు తొందరపడిపోయాడు. అయినా–"

మాటపగంలో సబ్బూ, తువ్వాలూ పట్టుకుని కృష్ణవేణి యివతలికి వచ్చింది. శాస్త్రి, మొగం కడుక్కోడానికి నూతిదగ్గిరికి వెళ్లాడు. ఒక్క అడుగు అక్కడే నుంచుని, తరవాత, కృష్ణవేణి వెనకాలే వెళ్లింది.

"మామ్మె, మాతల్లే! ఆలస్యం అయినా, నా కొడుక్కి చివరికి రత్నం దొరికింది" అని ముసలమ్మ బ్రహ్మానందపడింది.

"రత్నమే. సందేహం లేదు; కాని ఆరత్నం తాపడం చేసుకోడాని కివతల బంగారం వుండవద్దూ?" అని రుంజుమంటూ అడిగింది రాజమ్మ.

౨

రాజమ్మ సత్ర్యాగం తలపెట్టింది; కాని మార్గం కనపడ్డం లేదు.

ముసలమ్మ కొడుకుఅదృష్టానికి మురిసిపోతోంది. కాని "ఇంకా కడుపు వచ్చింది కాదు కోడలికి" అని మాత్రం కొంచెం యివవుతోంది.

తను స్కూలుకి వెళ్లాటప్పుడూ వచ్చాటప్పుడూ కారు సప్లయి చెయ్యనందుకు కృష్ణవేణిమీద శాస్త్రి మనస్సులో అసంతృప్తి పొటమరిస్తోంది.

సరిగా యీ సమయంలో మునిసిపల్ కౌన్సిలుకి కొత్త యెన్నికలు జరిగాయి.

పాతవారు కొందరు డేవిడీమన్నా పొందారు. కొత్తవారు కొందరు దిద్దుకు దిద్దుకు దివాణంయెక్కారు.

గుప్త విరమించగా, నాయుడు చెయిర్మన్ అయినాడు.

నిశ్చల మైన తటాకంలో రాయిపడ్డ ట్టయింది. ఒకప్పుడు, నాయుడు, డిస్ట్రిక్టు మున్సబీకోసం ప్రయత్నిస్తూ యాజులుసిఫార్సు కోరాడు. నిజానికి, యాజులికి, సర్కారులో మంచి పలుకుబడే వుంది; కాని అతను స్వయంకృషివల్ల పైకి వచ్చాడు. అత నెప్పుడూ యెవరిచేతా సిఫార్సు చేయించుకోలేదు, వొకరికి చెయ్యనూ లేదు. అది నీ సంగతి చెప్పి నాయుణ్ణి పంపేశాడు.

నాటికీ, నేటికీ నాయుడు హైకోర్టువకీలుగానే వుండిపోయాడు.

కాని యిప్పుడు మునిసిపల్ చెయిర్మన్.

*   *   *   *

వేసవి సెలవులు పూర్తిఅయి ఆవేళే మునిసిపల్ హైస్కూలు తెరిచారు.

కృష్ణవేణీ, కోటేశ్వరశాస్త్రీ, రాధమ్మా, యాజులూ బెంగళూరినుంచి సపరివారంగా మద్రాసు మెయిలు దిగారు.

ఆదరా బాదరా స్నానం చేసి, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని, టెన్నిస్‌బాటు హేండిల్ బారుకి తగిలించి శాస్త్రి దర్జాగా సైకి లెక్కాడు.

కాని స్కూలులో అడుగుపెట్టాటప్పటికి అతని నవనాడులూ కుంగిపోయాయి.

ఎవరి స్థానంలో అతను అక్టింగు చేస్తున్నాడో ఆ పెద్దమనిషీ, తనకి సెలవు అవసరం లేదని చెయిర్మ

నుకు విన్నవించుకుని, ఉత్తరువు పొంది, తన సీటులో తాను కూచుని వున్నాడు.

పైగా, గొప్ప పిల్లని పెళ్లిచేసుకుని తనకి బహుమతీ యివ్వనందుకు గురుతిగా వున్న స్కూలు నౌకరు ఆస్థితిలో అతనికేసి చూచి వెటకారంగా నవ్వాడు.

* * * *

"కానయితే నువ్వు మహా పొంగిపోయావు; గాని నీ కోడలి పాదం మంచిది కాదు."

కొడుకువుద్యోగం పోయినందుకే విచారిస్తూ వున్న తల్లిదగ్గిరికి వచ్చి రాజమ్మ, యెత్తిపొడుస్తూ యిలా అంది.

కోడల్ని తన కూతురు యిలా అన్నందుకు కూడా ముసలమ్మ చాలా విచారించింది.

"దాన్నలా అనకే. ఎన్ని వేల సంవత్సరాలు తపస్సు చేస్తే మన కలాంటి పిల్ల దొరుకుతుందే?"

"తపస్సు కూడా చెయ్యాలి యినపగజ్జల తల్లి కోసం? ఇనప్పెట్టెలో రెండు లక్షల కరుకు లున్న శెంట్రిచేత నిక్షేపంవంటి మొగుడికి వొక్క దమ్మిడీ అయినా కట్నం యిప్పించలేకపోయింది. తన మొగుడికి కట్నం రావడమే తనకి గొప్పో, రాకపోవడమే గొప్పో గ్రహించలేకపోయింది. దాని మూలంగా యేదో చిక్కు వస్తుందని నేనప్పుడే అనుకున్నాను. సరి, రానే వచ్చింది."

"ఆరు నెలల కిందట అది వస్తే —"

"ఆ రేమిటి, తొంభయ్యారేమిటి, నువ్వెన్ని చెప్పినా సరే, నీకోడలు నాతమ్ముడికి శనిగాను గాని మరోటి కాదు. పండుగలికి యేవో జామారు గుడ్డలు తప్ప అత్తవారివల్ల వొక్క దమ్మిడీ - గుడ్డిగవ్వ యెరుగునా తమ్ముడు? తమకి మూడు మేడలున్నాయి కదా, మన కొకటి కాపరంవుండమనేనా యివ్వకూడదూ? ఏ మిచ్చినా తమ కూతురికే వుంటుంది; గాని మన వొళ్లో పడదు గదా? ఆరాణీగారికోసమే గదా యేనిమిది రూపాయల కొంప విడిచిపెట్టి యీ పదిహేనురూపాయల యిల్లు మెడకి కట్టుకున్నాము? పైగా, అగరువత్తులు, సెంట్లు - తాంబూలానికి తుని ఆకులే గాని పనికి రాకపోయె —"

"తన సరదాకొద్దీ అవన్నీ అబ్బాయి తెస్తున్నాడు; కాని అది తెమ్మని నిర్బంధించిందా యేమిటే పాపం?"

"నువ్వెరుగుదువు పాపం"

"..................."

"నీమాటలు వింటే నాకు వొళ్లు మండుకుపోతోంది"

"..............."

"పోనీ, అదలా వుంచు. ఇప్పు డేమిటి దారి?" రాజమ్మ నిలవతీసి అడిగింది.

"నే నేం చెప్పగలనే?" అని ముసలమ్మ నెత్తీ నోరూ బాదుకుంది.

తల్లికేసి వురిమి చూస్తూ మరో నిమిషం బుస్సలు కొట్టి కొట్టి, రాజమ్మ, తమ్ముడి దగ్గిరికి వెళ్లిపోయింది.

ముసలమ్మకి దిక్కు తెలవలేదు. "దాన్నంటే పాపం వస్తుంది" అని వొకవేపున. "ఏమో: అమ్మాయి చెప్పినట్టు దాని పాదం మంచిది కా దేమో" అని మరో వేపున.

* * * *

"మనకి మెరుపుదీపం వద్దండీ" అంది కృష్ణవేణి.

"మరి నీ చదువూ, రాతా సాగవద్దూ?" అని అడిగాడు శాస్త్రి. రాత్రిళ్లు అత నేమీ చదవడు. రాయడు కూడానూ.

"నాకు హరికేన్‌లాంతరు చాలు" అంది ఆమె.

"నీ యిష్టం"

"అగరువొత్తులూ, సెంట్లూ కూడా తేవద్దన్నాను"

"సరే"

"తునిఆకులు మానేసి, ద్రాక్షారం ఆకులు తెస్తూ వుండండి యిక"

"అలాగే"

"................"

"ఇంకా యేమిటి? అన్నట్టు చూశాడతను.

"మా నాన్నారి నడిగి చెబ్బా తెస్తా" నని ఆమె అనలేదు. "అనవేం?" అని వొళ్లు రవలబెట్టుకున్నా డతను.

*   *   *   *

శాస్త్రి హితకారిణీ హైస్కూలు కమిటీవారి దగ్గిరికి నాలుగు వారాలు తిరిగాడు. అయిదో వారంలో ఆరు వారాల ఆక్టింగుపని యిచ్చారు వారు.

జీతం నెలకి యాభై రూపాయలు.

ఒక నెల కడిచింది.

ఒకనాడు పొద్దున్న తొమ్మిదిన్నర గంటల వేళ మునిసిపల్ హైస్కూలులో పని చేస్తూ వున్న వొక స్నేహితుడు వచ్చి "నువ్వు ఆక్టింగు చేసిన పోస్టు మళ్లీ కాళీ అయిందోయ్" అని చెప్పాడు.

శాస్త్రి స్తబ్ధుడై పోయాడు.

"నాతో, మళ్లీ సెలవుపెట్ట నన్నాడు?"

"ఇక మళ్లీ యీపనిలో ప్రవేశించడు"

"ఏం?"

"ఇన్సూరెన్సు పనిలో నెలకి నూట యాభై కిడుతున్నారుట. తెనుగుజిల్లాలకి ఒక బ్రాంచి ఏర్పడుతుందనీ, అతను బ్రాంచి సెక్రటరీ అయిపోతా డనీ అనుకుంటున్నారు"

"కావాలి. ముమ్మాటికీ కావాలి. చాలా సంతోషం"

"ఈమాటు నువ్వు గట్టిప్రయత్నం చెయ్యాలి. నీ మామగారిని పంపి మంత్రిదగ్గిరనుంచి ఘాటైన వుత్తరం తెప్పించవోయ్"

"తప్పకుండానూ" అన్నాడు శాస్త్రి.

యాజులునియమం శాస్త్రి యిప్పటికీ మొరగడు.

"పోనీ నువ్వు కూడా యేదేనా యేజన్సీ చూసుకోరాదూ?" అన్నాడు స్నేహితుడు సైకి లెక్కబోతూనూ.

"వెధవ యేజన్సీలు పోనిస్తూ. తిండీ తిప్పలూ లేకుండా రాత్రీ పగలూ నానాఅపసామ్యం మనుష్యులనూ ఆశ్రయించి దేవుళ్లాడాలి అయినా పని జరుగుతుం దని నిశ్చయం యేమిటీ? జీతం తక్కువయినా, టీచరుపని అయితే కడుపులో చల్ల కదలకుండా—పరిగత్తి పాలు తాగడం కంటే నుంచుని నీళ్లు తాగడం మంచిది. పైగా, టెన్నిస్ ఆడకపోతే నాకు నిద్రాహారాలు సయించవు. ఇన్సూరెన్స ఏజన్సీ పుచ్చుకుంటే దర్జా అయిన టెన్నిస్‌బాటు విడిచిపెట్టి వెధవకాగితాలు మొయ్యాలి గాడిదలాగ"

"గుడ్ బై" అంటే "గుడ్ బై" అనుకుని యెవరి స్కూలుకి వారు వెళ్లిపోయారు.

సాయంత్రం ఆరు గంటల వేళ "ఇందుకోసం వెడుతున్నా" నని రాజమ్మతో మాత్రం రహస్యంగా చెప్పి, శాస్త్రి, చెయిర్మన్ దర్శనానికి బయలుదేరాడు.

గుమ్మం దిగాటప్పటికి నీళ్లబిందె బుజాన పెట్టుకుని పదహారేళ్ల బంగారుబొమ్మ యెదురు వచ్చింది.

"మంచి శకునం. తొరగా అడుగు వెయ్యి" అని తొందరపెట్టింది రాజమ్మ.

నాళంవారి సత్రం దగ్గిరికి వెళ్లాటప్పటికి పొద్దుటి స్నేహితుడే యెదురుపడి, శాస్త్రిని చూసి సైకిల్ దిగాడు.

శాస్త్రి కూడా దిగాడు.

"ఎక్కడికోయ్" అన్నాడు స్నేహితుడు.

"అక్కడికే" అన్నాడు శాస్త్రి.

"లాభం లేదు"

"ఏం?"

శాస్త్రి యీ వొక్క అక్షరమూ సరిగా పలకలేకపోయాడు.

"ముందు మరొకడికి ఆర్డరు ఇచ్చే తరవాత సెలవు మంజూరు చేశాడు చెయిర్మను"

"ఏమిటీ?"

శాస్త్రి అప్రయత్నంగా సైకిలుకి చేరబడ్డాడు.

"తన మేనమామ అల్లుడికిచ్చాడు చెయిర్మను ఆఫీస్టు. మరి పోతా, అవతల కనిపెట్టుకుని వుంటారు. ఇప్పటికే అరగంట ఆలస్యం అయిపోయింది."

గంట గణగణ లాడించి స్నేహితుడు తుర్రుమన్నాడు.

తన స్కూలులోనే స్కూలుఫైనల్ తరగతి చదువుతూవున్న వొక బాలికకు అతను ట్యూటరు.

౬

శాస్త్రి, పదిహేను రోజుల కిందట బియ్యపు బస్తా అరువు తెచ్చాడు. బజారులో వస్తూ వుంటే వర్తకుడు పిలిచి కొంచెం సిష్ఠూరంగా మాట్లాడాడు.

మరో పది అడుగులు ముందుకి వచ్చాటప్పటికి యింటి యజమాని కనపడి "మా మాట మరిచేపోయారు. రెండు మాసాల అద్దె బకాయిపడిపోతే యివ్వడం కష్టం కాదూ? పైగా, యిప్పుడు మీకు ఉద్యోగం కూడా లేదుట కాదూ?" అని విసిగించి విడిచిపెట్టాడు.

దీనికి సాయం, క్లబ్బులో, ఆవేళ యెంత బాగా ఆడినా టెన్నిస్ ఆటలో అతను చాలా లిగాడయి పోయాడు.

అక్కడ అదీ. ఇక్కడ ఇది. అదివరకే కల్లోలంగా వున్న అతని మనస్సు దీంతో గజిబిజి అయి పోయింది.

లక్ష ఆలోచనలతో, కోటి విఘాతాలతో అతనింటికి వచ్చాడు.

లోపల అడుగుపెట్టాటప్పటికి "టెన్నిస్ బాటూ, కోటూ ఇవ్వండి" అని అడుగుతూ కృష్ణవేణి యెదురువెళ్లింది; కాని అతను "అక్కర్లేదు" అని కొంచెం దురుసుగా జవాబుచెబుతూ గదిలోకి వెళ్లి పోయాడు.

కృష్ణవేణి తెల్లబోయింది. పది నిమిషాల పాటు ఆమెకి దిక్కులు తెలవలేదు.

తరవాత, ఆమె కాళ్లీడ్చుకుంటూ గదిలోకి వెళ్లింది.

ఏమో ఆలోచిస్తూ పడకకుర్చీలో కూచుని వున్న శాస్త్రి, ఆమెను చూడడం తోటే గభీమని లేచి యివతలికి బయలుదేరాడు.

"మాట" అని పిలిచింది ఆమె.

అక్కడే నుంచుని, మొగం మాత్రం వెనక్కి తిప్పి "ఎందుకూ?" అన్నాడతను.

"మీతో మాట్లాడవలసివుంది. పది నిమిషాలు మీ రింటో కూచోవాలి" అంది ఆమె ఆజ్ఞాద్యోతకమైన స్వరంతో.

కృష్ణవేణి మంచాని కొక చివర ఆనుకుని నుంచుని వుంది. శాస్త్రి, వెళ్లి రెండో చివర ఆనుకుని నుంచుని "కూచో నక్కర్లేదు. అదేమిటో చెప్పు" అన్నాడు.

"మీరు చిరాకుగా కనపడుతున్నారు"

"అవును. మన స్నేమీ బాగా లేదు. చాలా గందరగోళంగా వుంది"

"ఏం?"

"ఉద్యోగం పోయింది. మళ్లీ దొరికే సూచనలేమీ లేవు. దారి కనపడ్డం లేదు"

"నాతో యేమీ చెప్పడం లే దేమీ?"

"నువ్వేమేనా తీరుస్తావా ఆరుస్తావా?"

వెనకా ముందూ ఆలోచించకుండా అత నిలా అనేశాడు.

కృష్ణవేణికి మనస్సు చివుక్కుమంది. కొంచెం కోపం వచ్చింది.

"దాపరికాలు నా కిష్టం లేదు. మనస్సులోనే కుమిలిపోవడం నా పద్ధతి కాదు. నా సంగతి మీకు మొదటే స్పష్టంగా చెప్పాను"

"అయితే యిప్పుడేమంటావూ?"

"మీ కష్టాలు మీ అక్క తీరుస్తారా? నాతో మీరేమీ చెప్పనక్కర్లేదూ? ఈ యింటి యాజమాన్యంతో ఆవిడకేమి సమ్మంధం వుందీ?"

"ఈ యింటికి యజమానురాలవు నువ్వే; కాని సంసారం యిప్పుడు ఆవిడ పోషిస్తోంది. ఏ సంగతీ ఆవిడతో చెప్పకతప్పదు. ఆవిడతో ఆలోచించక తప్పదు. ఆవిడ సలహా పుచ్చుకోకతప్పదు. ఆవిడ చెప్పినట్టు కూడా నడుచుకోక తప్పదు"

శాస్త్రి కొంచెం వుద్రేకంతో మాట్లాడాడు బుద్ధిపూర్వకంగా ఆమెయెడల తిరస్కారభావం కనపరిచాడు.

ఆమెకి చాలా కోపం వచ్చింది; కాని వోరిమి తెచ్చుకుని వూరుకుంది.

ఒక్క క్షణం రెప్ప వెయ్యకుండా చూసి శాస్త్రి యివతలికి వచ్చేశాడు.

కృష్ణవేణి మొదలునరికిన చెట్టులాగ మంచం మీదకి పడిపోయింది.

ఎప్పుడు పిలిచారో, ఎవరు పిలిచారో శాస్త్రి తాపితా కట్టుకుని వంటింటిలోకి వెళ్లాడు. అప్పటిదాకా ముసలమ్మో, రాజమ్మో యెవరు మడి కట్టుకుంటే వారు ఆమెనీ, అతన్నీ యేకబంతికి పిలిచేవారు. వారిద్దరూ వెళ్లి భోజనం చేసి వచ్చేవారు.

అలాంటిది, ఆవేళ శాస్త్రి వొకడే పెళ్లి పీట మీద కూచున్నాడు. తొంగిమాడగా పీటా, విస్తరీ శాస్త్రి కొక్కడికే పరిచివున్నాయి. వంట ముసలమ్మే చేసినా రాజమ్మ వడ్డిస్తోంది.

విస్తుపోయి, కృష్ణవేణి, చీకట్లో పడకటింటి అరుగుమీద కూచుంది.

లోపల ముసలమ్మ యేదో అడగడమూ, రాజమ్మ కసిరికొట్టడమూ వినపడ్డాయి. "కొన్నాళ్లదాకా నువ్వేమీ మాట్లాడకమ్మా" అని విసుక్కుంటూ శాస్త్రి అన్నమాట మాత్రం స్పష్టంగా వినిపించింది.

*　　*　　*　　*

"ఒరేయ్ శాస్త్రీ" అంటూ శాస్త్రి చిన్నమేనమామ వీథితలుపు తోసుకుని లోపలికి వచ్చాడు. "ఇలా రావయ్యా బుల్లి మామా" అని శాస్త్రి లోపలికి పిలిచాడు. "ఒక్క క్షణం దాటిపోయింది. అయితే, నీకు దేవతార్చన లేదు కాదూ? లేచి మడి కట్టుకో" అంటూ రాజమ్మ కాళ్లు కడుక్కోడానికి నీళ్లిచ్చింది.

"నీదయవల్ల నాకు దేవతార్చన లేదు; కాని నేను భోజనం చేసే వచ్చాను—"

మాటసగంలో అందుకుని రాజమ్మ తమ్ముడికేసి చూస్తూ "చూశావా?" అంది; కాని శాస్త్రికేమీ కనపడలేదు. ఏమీ బోధపడలేదు.

"నువ్వు కులాసాగా వున్నావా పెద్దక్కా?" అని ముసలమ్మని కుశలప్రశ్న.

"ఉన్నాను. పిల్లలూ మరదలూ కులాసాగా ఉన్నారా?" అని మారుప్రశ్న.

"ఏమిరా, ఎవర్నీ పిలవకుండానే పెళ్లి చేసుకున్నావూ?"

"తొందరయిపోయింది మామా"

"కాకపోయినా, యింతోటి పెళ్లికీ బంధువులు కూడా రావాలి. కట్నాలా కానుకలా?"

రాజమ్మ యీసడిస్తూ అడగడం మాని ముసలమ్మ తహతహలాడిపోయింది.

"ఏమిరా బొత్తిగా కట్నం లేకుండా చేసుకున్నావుటా?"

"అప్పటి కలా తోచిందయ్యా"

"అదో తెలివితక్కువ మాట" రాజమ్మ దురుసుగా అందుకుంది.

"కట్నం యివ్వకూడ దని వారికి వ్రతం. అంటే సీటలమీద చదివించ రనుకున్నాం గాని తర వాత యేదోవిధంగా ముట్టచెప్ప రనుకున్నామా యే మిటి? ఎనిమిదో నెల వెళ్ళ వస్తోంది యీ క్షణానికి వొక్క దమ్మిడీ యెరగం; కాని రజస్వల అయిన పిల్లని చేసుకున్నందుకు వెలి మాత్రం చుట్టబెట్టుకుంది. కాక పోతే, నువ్వెప్పుడేనా అక్కడాఅక్కడా భోజనం చెయ్యడం వుందా యీ వూరు వచ్చి?"

"వెలి అంటే యేమిటి గానీ, నావంటి చాదస్తపువాళ్ళ మాట కేం గాని వుద్యోగం ఖాయం అయిందా?"

"అసలు వుంటే గదా?" అన్నాడు శాస్త్రి.

"అదే" మన్నాడు మేనమామ.

"ఏమూహూర్తాన మళ్ళీ పెళ్ళయిందో గాని మా వాడికి, అప్పణ్ణుంచీ మాకు కష్టాలే వస్తున్నాయి. తమ్ముడికి వుద్యోగం ఆఖ రయింది. మళ్ళీ దొరక లేదు. దొరికే దారి కూడా లేదు. ఏదో వచ్చి పడిపోతుం దని యెనిమిది రూపాయల యిల్లు విడిచిపెట్టి పదిహేను రూపాయల యింటో పడ్డాను రెండు మాసాల అద్దె బాకీ. చేతిలో దమ్మిడీ లేదు"

శాస్త్రి భోజనం అయింది. మేనల్లుడూ మేన మామా వీధిఅరుగుమీదికి వెళ్ళి కూచున్నారు.

.. "మరి వడ్డిస్తున్నాను, నీకోడల్ని పిలుచుకో వమ్మా" అంది రాజమ్మ.

ముసలమ్మకి అప్పటికే నడుం విరిగిపోయి వుంది. కూతురు ధోరణి చూసి "యేదో మునుగుతుంది" అని ఆమె భయపడుతూనే వుంది.

కొడుకు రాజమ్మ చెప్పిన ట్లల్లా నడుచుకోవడం ఆమె కిష్టం లేదు; కాని ఆమెమాట ఎవరూ లక్ష్య పెట్టరు.

లక్ష్యపెట్టడందాకా యెందుకూ? ఇప్పుడు వెళ్ళి కోడల్ని పిలుచుకు రాకపోతే కూతురు చీపురు తిరగ వేస్తుంది.

జడుస్తూ జడుస్తూ బయలుదేరింది.

"అమ్మా! కృష్ణవేణీ" అని పిలిచింది ఆమె వొణుకుతూను.

"అమ్మా బొమ్మానూ" అని లోపల రాజమ్మ సణుక్కుంది.

"ఎందుకండీ అత్తా?" అంది కృష్ణవేణి లేచి నుంచుని.

"భోజనానికి రా తల్లీ"

"నేను భోజనం చెయ్యను. వెళ్ళి మీరు ఫల హారం చెయ్యండి"

"ఏ మమ్మా?"

"మీకే తెలుసు. ఇక నన్ను మాట్లాడించకండి అత్తా"

"బతిమాలడానికి నీ అబ్బసొమ్మేమీ లే దిక్కడ" అంటూ రాజమ్మ పళ్ళు కొరుక్కుంది.

కళ్ళల్లో నీళ్ళు కుక్కుకుంటూ, తూలిపోతూ లోపలికి వెళ్ళి కంఠం గద్గ దమయిపోగా మాట చెప్పలేక ముసలమ్మ కూతురుకేసి మిడుకుతూ మిడుకుతూ చూసింది.

"చెప్ప నక్కర్లేదు, నువ్వు కూచో" అని గదిమి, రాజమ్మ, తల్లి విస్తరిలోనూ, తన విస్తరిలోనూ వుప్పు పిండి వడ్డించి, తల్లి చెయ్యి ఆడక కుమిలిపోతూ వుం డగా నిర్విచారంగా తాను ఫలహారం ప్రారంభించింది.

తొమ్మిదిన్నర అయాక మేనమామను సాగ నంపేసి శాస్త్రి వచ్చి, మంచంమీద గోడవేపుకి తిరిగి పడుకున్నాడు.

తరవాత పది నిమిషాలదాకా చూసి, దీపం తగ్గించి, తలుపులు అలా తెరిచే వుంచి, కృష్ణవేణి, తుంగచాప పరుచుకుని పడుకుంది.

ఆరాత్రి తెల్లవార్లూ ముసలమ్మకి నిద్ర లేదు. వూరు మాటుమణిగాక కూతుర్ని లేపి సంగతిసందర్భా లడగాలని మహా అనుకుంది: కాని గుండెలు తాళలేదు.

౧౦

ఆ వేళ పౌర్ణమి. పాఠశాలకి సెలవు. అయినా, కృష్ణవేణి స్నానం చేసి దుస్తులు ధరించాటప్పటికి కారు వచ్చింది. "కాఫీ చేసుకుని పుచ్చుకోకపోతుందా" అని రాజమ్మ ఓరకంటితో చూస్తూనే వుంది; కాని కృష్ణవేణి ఆవిషయమే తలుచుకోలేదు.

ముసలమ్మ, రాజమ్మ దొడ్డికి వెళ్లడం చూసి, కోడలిదగ్గిరికి గబగబా వెళ్లి "ఏమమ్మా, కాఫీ పెట్టుకున్నావు కావేం?" అని జాలిగా అడిగింది.

"పుచ్చుకోతలుచుకోలేదు అత్తా" అని బదులు చెప్పింది కృష్ణవేణి.

"ఏం తల్లీ?"

"నిన్న రాత్రి భోజనంకంటే యెక్కువా అత్తా యీపూట కాఫీ?"

"మా అమ్మవు కావూ, మా తల్లివి కావూ? నీ:సం చేస్తుం దమ్మా! నేను కుంపటి అంటిస్తాను నువ్వు తొంగా కాఫీ చేసుకో అమ్మా! చేసుకోకపోతే నన్ను చంపుకు తిన్నట్టే."

"నేను పుచ్చుకోను అత్తా!"

దంతధావనం చేసుకుని మొగం తుడుచుకుంటూ శాస్త్రి, సరిగా యీసమయంలో అక్కడికి వచ్చాడు. కృష్ణవేణి వీథిలోకి వెళ్లి కా రెక్కింది.

కొడుకు పెడసరంగా మాట్లాడతా డని తెలుసు; కాని ముసలమ్మ వూరుకోలేకపోయింది.

"కాఫీ పుచ్చుకోకుండా వెడుతోందిరా" అంది ముసలమ్మ ఆత్రంగా.

"ప్రపంచం తల్లకిందులు కాదులే" అన్నాడు శాస్త్రి నిర్లక్ష్యంగా.

"అయ్యో! కొంప ముంచుకుంటావు ట్రా?"

"ఇంతమాత్రానికేనా?"

"నిన్నరాత్రి అన్నం కూడా తినలేదురా పాపం."

"ఏమిటో?"

శాస్త్రికి కంగారు ప్రారంభం అయింది. వీథికేసి చూశాడు. కారు అప్పుడే కదిలింది. అతనికి కాళ్లు వొణికాయి.

"నిక్షేపంవంటి పిల్లరా నాయనా! తగువులు పెంచుకోదు రా. మాట పడే మనిషి కాదురా అదీ. భాగ్యవంతుల పిల్లకావడం అలా వుండగా నీతో సమానంగా చదువుకుందిరా, అయినా తెగనీలుగు లెరగదురా."

మాటకి అడ్డు వచ్చి "అక్క యేదీ" అన్నాడు శాస్త్రి.

ముసలమ్మ నూతిదొడ్డి కేసి చూసింది. రాజమ్మ వస్తోంది.

"నిన్న రాత్రి కృష్ణవేణి భోజనం చేసిందిటే అక్కా?"

"లేదు."

"ఏం?"

"కోపం వచ్చింది కాబోలు...ఆకలే లేకపోయిందో?"

"అయ్యో!" అంటూ నోరు నొక్కుకుంది ముసలమ్మ.

తల తాటించుకుంటూ "ఏమి టా వేషం?" అంటూ రుంజుకుంది రాజమ్మ.

"నాతో చెప్పావు కాదేమే అక్కా?"

"ఇప్పుడేం వచ్చిందీ?"

"కాఫీ అయినా పుచ్చుకోకుండా వెళ్లిపోయింది"

"మానుతుం దనుకున్నావా యేమిటి? అక్కడ యెన్ని నీళ్లు తాగుతుందో" మూతి బిగించుకుని అడిగింది ఆమె.

"అయ్యో, అయ్యో" అని లోపలే అనుకుంటూ ముసలమ్మ నింపాదిగా గుండెలమీద కొట్టుకుంది. రాజమ్మ అందుకు కూడా మళ్లీ చిర్రు మంది.

"తెగేదాకా లాగుతావే నువ్వూ" అన్నాడు శాస్త్రి చేతకానితనం చూపిస్తూనూ.

"ఈ మాత్రం భాగ్యానికే కంగారు పడిపోతున్నావా యేమిట్రా నువ్వూ? మంచి మొగాడవే? ఇలా అయితే అది నీకు లొంగుతుందా?"

"నువ్వు లొంగావా?" అని తనలోనే అనుకుంది ముసలమ్మ.

"చాలా దూరం వెడుతుంది వ్యవహారం" అన్నాడు అతికష్టంమీద శాస్త్రి.

"తెగతెంపులు చేసుకుని వెళ్ళిపోతుందంటావా?"

శాస్త్రి మాట్లాడలేకపోయాడు.

"ఒక్క నాటి కలా చెయ్యదు. నాలుగు రోజు లుంటుంది యీ బెట్టుసరీ. తరవాత అది వచ్చి నీకాళ్ల మీద పడకపోతే నన్నుఛీ అను. నువ్విప్పుడు బింకంగా ఉండకపోతే యెప్పటికీ యేగాని అయినా పూడి పడదు."

"నాయనా! ఎవరికి కోపం వచ్చినాసరే నే నొక్కటి చెబుతా విను" అని మొదలుపెట్టింది ముసలమ్మ. "నీ రోజులు బాగా లేవు. అంచేతే నీ వుద్యోగం పోయింది. ఈ సమయంలో కుటుంబకల్లోలం కూడా తెచ్చిపెట్టుకొంటివా, నీకు మతిపోతుంది. పైగా కోడలిదగ్గిర నువ్వు తప్పు చూపించలేవు. వీథికి వెడితే నలుగురూ నిన్నే అంటారు. నీసంగతిసందర్భాలు తెలవకుండా అంత ఆస్తి వారు నీచేతిలో పెడతారు ట్రా? ఇంత వూళ్లో యేదో నౌకరీ సంపాదించుకో లేకపోతే అది నీచేతకానితనం అనిపించుకోదుట్రా? లైటు మానుకుందా? సెంట్లూ అగరువత్తులూ వద్దందా? అది ఎక్కడికక్కడికే సర్దుకునే మనిషి. కాని దేని కేనా నిన్ను యిబ్బందిపెట్టిందిట్రా పాపం? రోజూ నీబంతికి పిలుస్తూ హఠాత్తుగా నిన్న రాత్రి మానేస్తే దానికి చిన్నతనం గాదుట్రా? నువ్వు భోజనం చేశా టప్పుడు మామతో జరిగిన సంభాషణ అది విని వుంటే ఎంత తప్పూ?"

"ఏమీ మునిగిపోలేదు. ఈపాటికి కట్టిపెట్టు నీ వుపదేశం" అంటూ రాజమ్మ తల్లిమీద కళ్లెర్రజేసింది. "వోరేయ్! తమ్ముడూ! నీకు వచ్చిన భయమేమీ లేదు. నాదీ పూచీ. కాస్సేపటికో కాస్సేపటికో నీ అత్తగారూ, నీమామగారూ వస్తారు. నువ్వు మాత్రం బేలపోకు. కచ్చితంగా మాట్లాడేసెయ్యి. కాపరం చెడి పోతే దానికే చిక్కు; గాని నీ కేమీ యిబ్బంది లేదు" అని ఝుంకారంగా చెప్పింది ఆమె.

శాస్త్రికి ధైర్యం కలగలేదు; కాని రాజమ్మని కాదనలేకపోయాడు.

ముసలమ్మ నూతిదొడ్లోకి వెళ్లి నెత్తీ, నోరూ బాదుకుని కుమిలికుమిలి యేడ్చింది.

తన మాటలు బి. ఏ. చదివినవాడే ఆక్షేపించలేక పోవడంవల్ల తాను సరిగా మాట్లాడానని గర్వించింది రాజమ్మ.

* * *

తల్లినీ, తండ్రినీ చూశాటప్పటికి, కృష్ణవేణికి, దుఃఖం వుబ్బెత్తుగా పొంగింది; కాని మానవతి కనక అణిచేసుకుంది. అయినా మొగం డిల్లపోయి వుంది.

కూతుర్ని చూశాటప్పటికి, రాధమ్మకి, మనస్సు, చెయ్యిపెట్టి తిప్పేసినట్టయింది. వెంటనే దగ్గిరికి వెళ్లి "అలా వున్నావేం తల్లీ?" అంటూ ఆమె కూతుర్ని పొదివి పట్టుకుంది.

"ఏం యెలా వుంది?" అని అడుగుతూ రాజులు దగ్గిరికి వచ్చాడు.

పొదివిపట్టుకునే సోఫాదగ్గిరికి తీసుకువెళ్లి కూతుర్ని వొడిలో కూచోపెట్టుకుని, మొగం నిమురుతూ "కళ్లు గుంటలు కట్టా యేమమ్మా?" అని రాధమ్మ అడగ్గా, "అవును, మాట్లాడ వేమమ్మా?" అన్నాడు రాజులు ఆత్రపడుతూనూ.

కృష్ణవేణి వెక్కివెక్కి ఏడ్చి ఆపుకోలేకపోయింది. అక్కడికీ ఆమె యింకా ఆవేగం అణుచుకునే ప్రయత్నంలోనే వుంది.

"ఏదో బాధపడుతున్నావు. ప్రయత్నపూర్వకంగా దాస్తున్నావు. మొగం దిగాలుపడిపోయింది. ఎంచేతో చెప్పవూ తల్లీ?" అంటూ పక్కని కూచుని యాజులు లాలిస్తూ అడిగాడు.

"తెల్లవారి లేచి కాఫీ పుచ్చుకోలేదు. నాన్నారూ?" అంది కృష్ణవేణి పెదవులు తడుపుకుంటూను

తల్లీ, తండ్రీ వొక్క మాటే "యెంచేతా?" అన్నారు.

"నిన్నరాత్రి భోజనం కూడా చెయ్యలేదు."

ఆమె పెదవులు వొణికాయి. కళ్లుకూడా చెమ్మగిల్లాయి.

ఇక ఆపుకోలేక, ఆమె, కళ్లు మూసుకుని తల్లిని చేరపట్టింది.

రాధమ్మా, యాజులూ గజగజ లాడిపోయారు.

సరిగా యీ సమయంలో సుభద్రమ్మ అక్కడికి రాగా "కాఫీ చేసి తొరగా తీసుకురావమ్మా" అని తొందరపెట్టాడు యాజులు. సంగతి యేమిటో తెలవక కంగారుపడిపోయి వొక్క నిముషం అలాగే వుండిపోయి తరవాత సుభద్రమ్మ వంటింట్లోకి పరుగెత్తింది.

తనమీద వొట్టు పెట్టుకుని రాధమ్మ అనేకవిధాల అడగ్గా, కృష్ణవేణి, వొక్కమాటు కళ్లు మూసుకుని తరవాత తెరిచి, తుడుచుకుని "చెబుతాను వుండు" అని మళ్లీ కళ్లు మూసుకుంది.

"చెబుతుంది వుండు. కాస్త కాఫీ పుచ్చుకోనియ్యి" అని రాధమ్మతో అని, యాజులు "ఏం సుభద్రమ్మా! ఇంకా కాలేదా?" అంటూ వంటింట్లోకి పరిగెత్తాడు.

"ఒక్క కప్పు కాఫీ వుంది. ఇది పుచ్చుకునేటప్పటికి మళ్లీ చేస్తా"నని చెబుతూ సుభద్రమ్మ యెదురు వచ్చి, అది యాజులుచేతికిచ్చి మళ్లీ వెనక్కి పరిగెత్తింది.

యాజులు, కప్పు, రాధమ్మచేతి కిచ్చాడు. రాధమ్మ కృష్ణవేణి నోటి కందించింది. కాస్తకాస్త కాఫీ రెండు మాట్లు చప్పరించి, కృష్ణవేణి, తరవా కప్పు తానే పుచ్చుకుని ఆకాఫీ రెండు గుక్కల్లో తాగేసింది.

రాధమ్మ కప్పు పుచ్చుకుని, కింద పెట్టి, కృష్ణవేణి మూతి తుడిచి కంఠం రాసింది.

తరవాత సరిగా కూచుని కృష్ణవేణి జరిగిందంతా చెప్పింది.

రాధమ్మ కొయ్యయిపోయింది. యాజులు అగ్గయిపోయాడు.

౧౧

యాజులు, గంటలకొద్దీ తీవ్రాలోచన చేశాడు; కాని కర్తవ్యం తేల్చుకోలేకపోయాడు.

ఎదటింటి పెద్దమనిషి పెద్ద వకీలు. అయితే, ప్రస్తుతం రిటైరై గ్రంథరచనతో కాలక్షేపం చేస్తున్నాడు.

యాజులికీ అతనికీ మంచి పరిచయం వుంది.

యాజులు న్యాయాన్ని పూజిస్తాడు. అక్కడ అతనికి స్వపరభేదం లేదు.

వకీలు ఎదటివారిని పాయంటుదగ్గిర ఆపేస్తాడు. మరి ముందుకి వెళ్లనివ్వడు. అతనికి డొంకతిరుగుళ్లు పనికిరావు. వకాల్తీ చేసే రోజుల్లో ఎదటి వకీలు రోజులకొద్దీ వాదన చేస్తే, అతను పాయంటు మాత్రం చూపించి కొన్ని నిమిషాల్లోనే కూచునీవాడు. యూరపియన్ ఆఫీసర్లందరూ అతన్ని చాలా మెచ్చుకునీవారు.

అంచేతే అతనికీ యాజులికీ కలిసింది.

భోజనాలు కాగానే కృష్ణవేణీ, వకీలూ బయలుదేరారు.

"అమ్మాయి ప్రవృత్తి మీకు బాగా తెలుసు. మనకి నలుగుళ్లు పనికిరావు. మీరు గొడవలు పెరగనివ్వరు. పర్యవసానం కచ్చితంగా తేల్చేస్తారు. అంచేతే మీ సాయం కోరాము. ఎటయినా సంతోషమే; కాని తాత్సారం సాగనివ్వవద్దు" వెళ్లేటప్పుడు, యాజులు

ఆపెద్దమనిషికి ఇలా చెప్పాడు. కృష్ణవేణీ వకీలూ కారులో కూచున్న తరవాత అతను స్వయంగా తలుపు వేస్తూ "కృష్ణవేణి మీఅమ్మాయి. మరి వెళ్లి రండి" అంటూ సాగనంపాడు.

అతను ఇంట్లోకి వచ్చాక రాధమ్మ "యే మవుతుం దంటారూ?" అని అడిగింది.

"మన అమ్మాయి మన యింటికి వచ్చేస్తుంది."

"కాపరం లేనట్టే?"

"దానివల్ల లేశ మయినా తప్పిందా?"

"ఎక్కడో రాకాసిపీనుగు దొరికిం దండీ ఆడబడుచూ."

"అల్లుడికి బుద్ధి వుంటే ఆడ యేం చెయ్య గలదూ?"

రాధమ్మ మాట్లాడలేకపోయింది.

* * *

వీరు వెళ్లాటప్పటికి, శాస్త్రి, రాజమ్మ, మేనమామా వాకట్లో కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

రాజమ్మ గోడచాటుకి తప్పుకుంది.

శాస్త్రి తుంగచాప పరిచి "దయచెయ్యండి" అని వకీలుకి స్వాగతం చెప్పాడు.

కృష్ణవేణి పడకగది గుమ్మంలో నుంచుంది.

"ఏమి సెలవు? ఎప్పుడూ రానివారు దయ చేశారు" అన్నాడు శాస్త్రి వినయం కనపరుస్తూ.

"ఎప్పుడూ రానివాణ్ణే కాని రాకూడనివాణ్ణి కాను. వీ రెవరు?"

"మా బుల్లి మేనమామగారండి."

"నన్ను యాజులుగారు పంపారు. అమ్మాయి పనిమీద వచ్చాను. దాంపత్యధర్మాలు చర్చకి రానివ్వడం విద్యాధికు లైన మీ వంటి యువకులకు సరస మైన పని కాదు."

"ఇప్పు డలాంటి దేమీ రాలేదే?"

"పూర్తిగా వచ్చింది."

"తమకిన్ని అలా తోచడం ఆశ్చర్యకర మే."

"కా దని మీ నిశ్చయ మైతే నా సందేహాలు తీరుస్తారా?"

"తప్పకుండానూ."

"కాస్సేపటికో కాస్సేపటికో నీ అత్తగారూ, నీమామగారూ వస్తారు. నువ్వు మాత్రం బేలపోకు, కచ్చితంగా మాట్లాడేసెయ్యి" అని పొద్దున్న రాజమ్మ చెప్పిన మాట అత నిప్పుడు పూర్తిగా నెమరుకు తెచ్చుకుని "మరి అడగండి" అన్నట్టు స్థిరంగా కూచున్నాడు.

వకీలు కంఠం సద్దుకుని ప్రారంభించాడు.

"పెళ్లి నాటికి అమ్మాయి కృష్ణవేణి రజస్వల అయి చాలా రోజు లయిం దని మీ కందరికీ బాగా తెలుసు."

"చిత్తం."

"చిత్తం అంటే నాకు చాలదు. సూటిగా చెప్పండి."

"తెలుసు. అంగీకరించాము."

"యాజులుగారు, కట్నం యివ్వ మనీ, లాంఛనాలు కూడా యేమీ యివ్వమనీ, తమ ఆస్తి యే విధంగానూ, యెంతమాత్రమూ మీకు దఖలుపరచ మనీ కచ్చితంగా చెప్పేశారు."

"అవునండి."

"నిన్న రాత్రి, భోజనాల వేళ మీ తోడబుట్టిన ఆమె, మీ మేనమామగారితో మీరెండో పెళ్లి మాట ప్రస్తావిస్తూ "కట్నం యేమీ యిచ్చారు కారనీ, తరవాత యేదో విధంగా ముట్టచెబుతా రనుకుంటే గుడ్డిగవ్వ కూడా రాల్చలే దనీ, పైగా వెలి మాత్రం చుట్టబెట్టుకుం దనీ చాలా దురుసుగా చెప్పారు కారూ?"

"నే నేమీ అనలేదే?"

"అది తగ దని ఆవిణ్ణి మందలించారా?"

"అయ్యా," అని మేనమామ అందుకున్నాడు. "అది చిన్నపిల్ల. వీడూ చిన్నవాడే ఏదో పొరపాటు వచ్చింది."

"అయితే, తమరు కూకలేశారా?"

"నా కెందుకు బాబూ వాళ్ల గొడవలు?"

"పోనీ మీరు వూరుకోండి. శాస్త్రిగారూ! ఏమంటారు?"

"మందలించలేదు."

"ఎనిమిది రూపాయల యిల్లు పనికిరాదనీ, పదిహేను రూపాయలైనా సరే యీ యింట్లో ప్రవేశించవలసిందనీ అమ్మాయి మిమ్మల్ని నిర్బంధించిందా?"

"లేదు. పెళ్లికి పూర్వమే మేమీ యింట్లో ప్రవేశించాము."

"పెళ్లి అయింది మొదలు ప్రతీరాత్రీ మీ యింట్లో, అమ్మాయీ మీరూ ఏకబంతిని భోజనం చేస్తున్నారు కాదూ?"

"నిజమే; కాని యెప్పుడైనా అలా జరక్కపోతే అది తగువా?"

"కారణం వుంటే కాను."

"నిన్న అలాంటి యేర్పాటు లేకపోవడమే కారణం."

"ఏకబంతిని భోజనాలు జరక్కపోవడానికి, నిన్న ఏర్పాటు లేకపోవడమే కారణం. బాగానే వుంది. అయితే అలాంటి యేర్పాటు లేకపోవడానికి కారణం?"

"....................."

"సెలవివ్వండి."

"చెబుతాను కానివ్వండి."

"ప్రతీరోజూ మీ అమ్మగారో, మీ అక్కగారో పిలిస్తేనే వస్తోందా, అమ్మాయి స్వయంగానే వచ్చి కూచుంటోందా?"

"పిలిస్తేనే..........."

"అయితే, నిన్నరాత్రి పిలవకపోవడానికి కారణం?"

"నాయిష్టం. నన్ను ఆజ్ఞాపించడానికెవరి కధికారం వుందీ? అసలు నేను వడ్డించకపోతే మాత్రం యెవరేం చెయ్యగలరూ?" అంది గోడచాటునుంచి రాజమ్మ.

"మా అక్క స్వతంత్రురాలు. ఆవిడ నామీద ఆధారపడివుండలేదు. ఆవిణ్ణి ఆజ్ఞాపించడానికి నాకేం హక్కుందీ?" అని శుకానువాదం చేశాడు శాస్త్రి.

"మీ అమ్మగారు వంటింట్లోనే వున్నారు కాదూ అప్పుడూ?"

"వుంది; కాని వృద్ధకంవల్ల వొకచోట చదికిల పడిపోయింది."

"పోనీ మీరు పిలిచారా?"

"అయ్యో! ఆడదాన్ని మొగుడు భోజనానికి రమ్మని పిలవడం యేమిటండీ?" అన్నాడు మేనమామ.

"మీరు వూరుకోండి. ఒకరి గొడవలు మీ కక్కర్లేదు.........ఏమంటారు శాస్త్రిగారూ?"

"నేనూ పిలవలేదు. అయితే బొట్టుపెట్టి పిలవ వలసిందేనా?"

"ఇక్కడికి యెనిమిది మాసాలనుంచి మామూలు తప్పకుండా వుండి హఠాత్తుగా నిన్ననే యెందుకు మానేశారూ?"

"సద్దుకోవాలి గాని ప్రతీదానికీ ఆరా తీస్తే యెలా గండీ?"

"అయితే, రాత్రి అమ్మాయి భోజనం చెయ్య లేదని మీకు తెలుసు కాదూ?"

"తెలవదు."

"ఇప్పటికీ తెలవదూ?"

"అది పుట్టింటికి వెళ్లాక తెలిసింది."

"పొద్దున్న కాఫీ కూడా పుచ్చుకోలే దని—"

"అదీ తెలిసింది."

"రాత్రి ఆమె తుంగచాప పరుచుకు పడుకుంది కాదూ?"

"అవును."

"ఏమని మీరు అడిగారా?"

"నన్ను బతిమాలుకో మ్మంటారా?"

"అనలేదు. జరిగింది చెప్పండి."

"అడగలేను. అయితే మీ రేంచేస్తారూ?"

"ఏమీ చెయ్యను.........మీ వుద్యోగం పోయిం దని అమ్మాయితో చెప్పారా?"

"చెప్పలేదు."

"మీ అక్కతో చెప్పారు కారూ?"

"చెప్పాను. ఏం, చెబితే?"

"ఏమీ లేదు.........అమ్మాయి మీ కష్ట సుఖాలు తెలుసుకోగూడనిదా?"

"..................."

"సెల వివ్వండి."

"తెలుసుకో తగిందే."

"మరెందుకు చెప్పారు కారూ?"

"అది నాయిష్టం."

"విత్తం.........అయితే యిప్పుడు మీ సంసారం మీ అక్క పోషిస్తున్నారు. అవునా?"

"అవును."

"సాయం చెయ్యవలసిం దని మీరు కోరారు. కదూ?"

"లేదు. ఆవిడే నాసంగతి తెలుసుకుని చేస్తోంది."

"మీ వుద్యోగం పోయిం దని మీరు చెప్పడం వల్ల తెలిసింది. అంతేనా?"

"అలాగే."

"మీ వుద్యోగం పోయిన సంగతి చెబితే తల్లిదండ్రులను కోరి అమ్మాయి యెంత డబ్బు తెచ్చునో యేమేనా ఆలోచించారా?"

"దేహీ అని యాచించనా?"

"మీరు మాట తప్పిస్తున్నారు. నేను యాచించమన లేదు. ఉద్యోగం పోయినట్టు చెప్పారా? అన్నా నంతే."

"చెప్పే దేమిటి? అది చూడ్డం లేదూ?"

"మీ అక్క మాత్రం చూడ్డం లేదూ? ఆవిడకు మాత్రం నోటితో యెందుకు చెప్పారూ?"

"ప్రాణాంతకంగా వున్నాయే యీ ప్రశ్నలు. వీటి కిక అంతం లేదా యేమిటి? బాగానే వుంది ధోరణి" అని విసుక్కున్నాడు మేనమామ.

"అడిగిన కొద్దీ వాజమ్మలాగ జవాబులు చెప్పడమేట్రా? గిగ్గా భిడియమూ వుండకద్దూ? కాస్తయినా బుద్ధి లేకపోతే యెలాగ?" అని చాటునుంచి రాజమ్మ కసిరింది.

శాస్త్రికి ఆధారం దొరికింది. "అయ్యా! మీరు పెద్దమనుష్యులే; కాని అనవసర ప్రస్తావన చేస్తున్నారు. నే నిక మీ కేమీ జవాబు చెప్పను" అని మూతి బిగించుకున్నాడు అతను.

"ఇక అక్కర్లేదు. నేను తెలుసుకోవలసినదాని కంటే అధికంగానే తెలిపించారు మీరు" అంటూ వకీలు కృష్ణవేణికేసి చూశాడు.

ఆమె అందుకుంది.

"బాబుగారూ! మీ రూరుకోండి. ఏమండీ! భార్య అంటే బానిస కాదనీ, సమాన భాగస్వామిని అనీ, నాహక్కులు నేను పూర్తిగా అనుభవిస్తూ వుంటాననీ మొట్లో చెప్పాను కాదూ?"

"అయితే?"

"అవసరం వచ్చిం దని నాకు తోచినప్పుడు గృహిణికి వుండవలసిన అధికారాలన్నీ నేను దఖలు పరుచుకుంటా ననిన్నీ అప్పుడు మీతో చెప్పాను కాదూ?"

"చెబితే?"

"ఇప్పుడు అలాంటి అవసరం వచ్చింది కనక చెబుతున్నాను. ఇది మొదలు మీరూ, నేనూ, మీ అమ్మ తప్ప మన యింటో వరోమనిషి వుండడానికి వల్లకాదు."

"నన్ను పొమ్మనడానికి నువ్వెవర్తివే? నువ్వెక్కణ్ణుంచి వచ్చావే?" అని పళ్లు కొరికింది రాజమ్మ.

"మా అక్క అవతలికి వెళ్ళిపోవా లంటావా నువ్వు?" అని అడిగాడు శాస్త్రి.

"నుంచున్నపాళంగా" అంది కృష్ణవేణి దృఢ స్వరంతో.

"వెళ్లదు" అన్నాడు అంతకంటే దృఢస్వరంతో శాస్త్రి

"సరే అయితే."

ఇలా అంటూ కృష్ణవేణి వీధికేసి చూసి "డ్రైవర్!" అని పిలిచింది. "వచ్చా నమ్మా" అంటూ అత నొక్క గంతులో అక్కడ ప్రత్యక్షమయినాడు.

మేనమామ తెల్లపోయాడు. తనని కొట్టిస్తుందో, రాజమ్మని గెంటిస్తుందో అని శాస్త్రి కొంచెం భయ పడ్డాడు.

రాజమ్మ కంగారుపడుతూ తొంగిచూసింది.

అప్పుడు కృష్ణవేణి గదిలోకి వెళ్లి తన సామానంతా తెచ్చి డ్రైవరు కందించి "కారులో పెట్టి రావోయ్" అంది

"ఎత్తం" అని డ్రైవరు నిమిషంలో మళ్లీ వచ్చాడు. "బాబుగారూ, లేవండి" అంది ఆమె. వకీలు వేస్తూ "అబ్బాయీ! మీరు తొందరపడ్డారు. ఇంకా తొందరపడుతున్నారు. చదువుకున్నవారితో యెలా మసులుకోవాలో మీరు గమనించినట్టు లేదు" అన్నాడు.

శాస్త్రి కృష్ణవేణికేసి వురిమి చూస్తూ "ఎక్కడికి నడతావ్?" అంటూ చొక్కా చేతులు పైకి తీస్తూ గభీ మని నుంచున్నాడు.

"ఓహో! నీకు ఆసరదా కూడా వుందా?" పళ్లు బిగించి తల వూపుతూ అందుకుంది ఆమె.

"అయితే రా. మరి ఆలస్యం యెందుకూ? నేను నేర్చుకున్న జపాన్ కుస్తీకి యిప్పటిదాకా వినియోగం లేకపోయింది."

ఇలా అని కృష్ణవేణి పంజా చాపింది. చొక్కా సద్దుకుంటూ డ్రైవరుకూడా ముందుకి వచ్చాడు.

శాస్త్రి బుస్సలు కొడుతూనే వున్నాడు; కాని కాళ్లు వొణుకుతున్నాయి

మేనమామకి కూచుని వుండగానే కళ్లు భైరవులు కమ్మాయి.

"వొరేయ్! ఇంట్లోకి పోరా, కదల వేమిరా?" అని రాజమ్మ మెల్లిగా కూకలేసింది; కాని శాస్త్రి అంతకి ముందే యేం జరుగుతోందో తెలవకుండానే చదికిలబడ్డాడు.

"నువ్వింత అనాథ వని మే మెవరమూ అనుకోలేదు. సాటి ఆడదాన్ని పెళ్లి చేసుకున్నందుకు నేను చాలా సిగ్గుపడుతున్నాను. ఇక నీ మొగం చూడను. చిక్కులు పెడితే కాపరం వొదులుకుంటుందా అనీ, డబ్బు కట్టుకురాకపోతుందా అనీ ఆలోచించావు; కాని నీవంటి వాజమ్మతోనా కాపరం? బి. ఏ. ప్యాసయి వుండీన్నీ గుడ్డిగవ్వకి మారని నీకా డబ్బివ్వడం? హిందూలాలో విడాకుల సూత్రం లేనందుకు మురుస్తున్నావేమో; నాకు మొగుడే కావా లంటే లక్షమార్గాలున్నాయి తెలుసా? కబడ్దార్! డబ్బుకోసం గడ్డి తింటావా? నమ్మిన భార్యని ద్రోహం చేస్తావా? నీమడా! అక్కా నీతో కాపరం చేసేది పెళ్లామా? ఛీ! పురుగా!" ఇలా అంటూ శాస్త్రిని విసిరి కొట్టి "రండి బాబుగారూ" అంటూ ముందు కృష్ణవేణి బయలుదేరింది.

తరవాత వకీలు బయలుదేరాడు.

డ్రైవరు వెనక్కి తిరిగి చూస్తూ తరవాత వెళ్లాడు.

కారుదగ్గిరికి వెళ్లాటప్పటికి, రోదటింటికి పెత్తనాకి వెళ్లి వుండి, యిదేమీ యెరక్కుండానే — మామూలుగానే యింటికి వస్తూ మసలమ్మ యెదురు పడింది. వెంటనే కృష్ణవేణి స్లిప్పర్లు దూరంగా విడిచి "అమ్మా, ఇక మీ రెవరో, నే నెవరో" అంటూ ఆవిడపాదాలు ముట్టుకు కళ్ల కద్దుకుని, మళ్లీ జోడు తొడుక్కుని కారులో కూచుంది.

కంగారు అణుచుకుని, గద్గదకంఠంతో మసలమ్మ యేదో అంది; కాని బుర్రు మంటూ కారు వెళ్లిపోయింది.